ఆదివారం
SUNDAY
22-11-2026

జగిత్యాల JAGITIAL | పేజీలు:12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00

సంపుటి: 2 Volume:2 | సంచిక: 143 Issue: 143

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com



4000 మంది అగ్నివీరుల డేటా చోరీ

14 ఏళ్ల బాలుడి హ్యాకింగ్.. డార్క్ వెబ్‌లో అమ్మే యత్నం

హర్యానా బల్లాభ్‌గఢ్‌లో బాలుడిని పట్టుకున్న ఢిల్లీ పోలీసులు



ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లలో నాలుగేళ్ల సర్వీస్ కోసం ప్రవేశపెట్టిన అగ్నివీర్ పథకానికి సంబంధించిన వెబ్‌సైట్‌పై సైబర్ దాడి జరిగింది. మాజీ అగ్నివీరులు ఇతర ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగ ఖాళీల కోసం దరఖాస్తు చేసుకునే ఒక టెస్ట్ వెబ్‌సైట్‌ను హర్యానాకు చెందిన 14 ఏళ్ల బాలుడు హ్యాక్ చేశాడు.

న్యూఢిల్లీ: ఈ హ్యాకింగ్ ద్వారా సుమారు 4,000 మంది అగ్నివీరుల వ్యక్తిగత వివరాలను సేకరించి, వాటిని డార్క్ వెబ్‌లో విక్రయించేందుకు యత్నించాడు. ఈ సమాచారాన్ని 500 డాలర్లకు (దాదాపు రూ.40 వేలకు పైగా) అమ్ముతానంటూ డార్క్ వెబ్‌లో బాలుడు ఒక ప్రకటన కూడా పోస్ట్ తరువాయి 2 వ పేజీలో...

పంజాబ్ పోలీసుల హత్యకు ఐఎస్ఐ గాలం

రూ.5 వేలకే మర్డర్లు.. డ్రగ్స్ సరఫరా

ఇతర ఉత్తరాది రాష్ట్రాలకు నెట్‌వర్క్ విస్తరణకు కుట్ర



పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ, భారతీయ యువతను లక్ష్యంగా చేసుకుని సరికొత్త, ప్రమాదకరమైన కుట్రకు తెరలేపింది. విలాసవంతమైన జీవితం, సులభంగా డబ్బు సంపాదించవచ్చని ఆశ చూపి, వారిని ఉగ్ర కార్యకలాపాల్లోకి దింపుతోంది.

చండీగఢ్: కేవలం రూ.5,000 వంటి స్వల్ప మొత్తాలకు ఆయుధాలు, మాదకద్రవ్యాల సరఫరా నుంచి కాంట్రాక్ట్ హత్యల వరకు చేయిస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ కుట్రలో చిక్కుకున్న యువత, బయటకు రాలేక మరింత లోతైన నేరాల్లో కూరుకుపోతున్నారని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐఎస్ఐకి చెందిన షాజాద్ భట్టి నెట్‌వర్క్ ఈ నియామకాల్లో కీలక తరువాయి 2 వ పేజీలో...

ఫ్యామిలీలో ఒక్కరికే బీమా

18 నుంచి 59 ఏళ్ల వారికి అవకాశం

గ్రామాలు, పట్టణాల్లో నెల పాటు నమోదు.. ఒక్కరికంటే ఎక్కువ మంది నామినీలకు చాన్స్

రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ



హైదరాబాద్, నవంబర్ 21 (ఈవార్తలు):
ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో కుటుంబానికి ఒకరిని ఎంపిక చేసి నమోదు చేసేందుకు తెలంగాణ ప్రణాళికా శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. కుటుంబం సూచించే సంపాదించే వ్యక్తికి ప్రాధాన్యం ఇస్తారు. బీమా అమల్లో ఉన్న కాలంలో ఆ వ్యక్తి మరణిస్తే నామినీలకు మొత్తం రూ.5 లక్షలు అందుతాయి. దరఖాస్తుల స్వీకరణకు గ్రామ పంచాయతీలు, పట్టణాల్లో ఎంపిక చేసిన వార్డుల్లో నెల రోజుల పాటు శిబిరాలు నిర్వహించనున్నారు. శిబిరాల తేదీలు, వేదికలు, బాధ్యత వహించే అధికారుల వివరాలను స్థానికంగా ముందే ప్రకటిస్తారు.

నమోదు సమయానికి 18 నుంచి 59 ఏళ్ల వయసు ఉండాలి. 1967 నవంబర్ 19 నుంచి 2008 నవంబర్ 18 మధ్య జన్మించిన వారు అర్హులని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. వయసు నిర్ధారణకు ఆధార్‌లోని పుట్టిన తేదీని తీసుకుంటారు. అందులో సంవత్సరం మాత్రమే ఉంటే, ఆ ఏడాది జూలై 1ని పుట్టిన తేదీగా పరిగణిస్తారు. పుట్టిన తేదీ తప్పుగా ఉంటే గుర్తింపు పొందిన ఆధార్ కేంద్రంలో సరిచేసుకున్న తర్వాత నమోదు చేసుకోవాలి. బీమా అమల్లోకి వచ్చాక గరిష్ఠ వయోపరిమితి దాటినా, ఆ పాలసీ సంవత్సరం ముగిసే వరకు రక్షణ కొనసాగుతుంది. శిబిరానికి వచ్చేటప్పుడు ఆధార్ కార్డు, అందుబాటులో ఉంటే రేషన్ కార్డు తీసుకురావాలి. మొబైల్ నంబర్ ఇవ్వాలి. తెలంగాణలో జారీ చేసిన రేషన్ కార్డు ఆధారంగా నమోదు చేస్తారు. కార్డు నంబరే దరఖాస్తు నంబరుగా ఉంటుంది. ఒక కార్డుపై ఒకే తరువాయి 2 వ పేజీలో...

సవాళ్లతో సావాసం చేస్తా

చాలెంజెస్‌ను సవాళ్లను ఎదుర్కోకుండా ఉండను

మన ఆలోచనలే ప్రగతికి అడ్డంకులు కావొద్దు

సంకుచిత ఆలోచనలు వీడితేనే కొత్త అవకాశాలు

50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు: మోదీ

ఐఐటీ ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో యువతకు దిశానిర్దేశం



ఖరగ్‌పూర్, నవంబర్ 21:
సవాళ్లను ఎదుర్కోవడం తన స్వభావంలోనే ఉందని, సమస్యలకు భయపడి వెనక్కి తగ్గితే ప్రగతి సాధించలేమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వ్యక్తులైనా, దేశమైనా తమ ఆలోచనలకు పరిమితులు విధించుకుంటే కొత్త అవకాశాలను అందిపుచ్చుకోలేరని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని ఐఐటీ ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో శనివారం ఆయన పాల్గొని ప్రసంగించారు. సవాళ్లను అధిగమించే ధైర్యం ఉన్నప్పుడే అసాధ్యమనుకున్న లక్ష్యాలను సాధించగలమని విద్యార్థులకు సూచించారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత యువతపైనే ఉందని స్పష్టం చేశారు.

మనిషి తన సామర్థ్యాన్ని తానే తక్కువగా అంచనా వేసుకోవడం అతిపెద్ద సమస్యగా మారుతోందని మోదీ అభిప్రాయపడ్డారు. ఏది సాధ్యమో, ఏది అసాధ్యమో ముందుగానే నిర్ణయించుకుని అవకాశాలను వదులుకుంటున్నారని అన్నారు. ఇలాంటి ఆలోచనలను మార్చుకోవాలని పిలుపునిచ్చారు. సవాళ్లకు సవాలు విసిరే ధైర్యమే విజయానికి పునాదని చెప్పారు. దేశాలు కూడా తమ ఆలోచనా పరిధిని విస్తరించుకున్నప్పుడే అసలైన తరువాయి 2 వ పేజీలో...

శ్రీవారికి 121 కిలోల బంగారం విరాళం

టీటీడీ చరిత్రలో అతిపెద్ద కానుక

26న స్వామివారికి సమర్పించేందుకు ఏర్పాట్లు

తిరుమల, నవంబర్ 21 (ఈవార్తలు):
కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారికి ఓ భక్తుడు అరుదైన, అత్యంత భారీ కానుకను సమర్పించేందుకు సిద్ధమయ్యారు. ఏకంగా 121 కిలోల బంగారు ఆభరణాలను శ్రీవారికి విరాళంగా ప్రకటించారు. ఈ నెల 26న (2026 నవంబర్ 26) ఈ ఆభరణాలను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కి అధికారికంగా అందజేయనున్నారు. ప్రస్తుత మార్కెట్ లెక్కల ప్రకారం ఈ బంగారు ఆభరణాల విలువ సుమారు రూ160 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. స్వామివారి కోసం మొత్తం 45 రకాల స్వర్ణాభరణాలను 9 ప్రత్యేక సెట్లుగా అత్యంత నైపుణ్యంతో తయారు చేయించారు. ఈ భారీ విరాళాన్ని అందజేస్తున్న భక్తుడు తన పేరును, వ్యక్తిగత వివరాలను వెల్లడించడానికి ఏమాత్రం ఇష్టపడలేదని సమాచారం. గోప్యత పాటిస్తూ పూర్తిగా స్వామివారి భక్తి ప్రపత్తులతోనే ఈ విరాళాన్ని అందజేస్తున్నారు. ఈ 121 కిలోల ఆభరణాల సమర్పణ వెనుక ఒక ప్రత్యేక విశేషం ఉంది. తిరుమల శ్రీవారి మూలవిరాట్‌కు నిత్య అలంకరణలో ఉపయోగించే బంగారు ఆభరణాల మొత్తం బరువు సుమారు 120 కిలోల వరకు ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకున్న ఆ భక్తుడు, మూలవిరాట్ అలంకరణకు సరిపోయేలా 120 కిలోలకు అదనంగా మరో కిలో కలిపి మొత్తం 121 కిలోల బంగారంతో విశేష ఆభరణాలను సిద్ధం చేయాలని సంకల్పించారు.

బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

గ్రాము-24 క్యారెట్స్):	రూ.12,508
వెండి (కిలో):	రూ.1,75,000
ప్లాటినం (గ్రాము):	రూ.3,856

జీటీఏ-6.. తొలిరోజే 31,000 కోట్లు

మొదటి రోజే 3.25 కోట్ల యూనిట్లు అమ్మకం



న్యూయార్క్, నవంబర్ 21 (ఈవార్తలు):
ప్రపంచ వీడియో గేమింగ్ చరిత్రలో కనీవినీ ఎరుగని సరికొత్త రికార్డు నమోదైంది. అత్యంత భారీ అంచనాల నడుమ విడుదలైన యాక్షన్-అడ్వెంచర్ గేమ్ 'గ్రాండ్ తెఫ్ట్ ఆటో 6' (జీటీఏ 6) ప్రపంచ వినోద రంగాన్ని షేక్ చేసింది. విడుదలైన కేవలం 24 గంటల వ్యవధిలోనే ఏకంగా 3.79 బిలియన్ డాలర్ల (సుమారు రూ.31,000 కోట్లపైనే) అంతర్జాతీయ అమ్మ కాలను సాధించింది. గతంలో తన మునుపటి వెర్షన్ 'జీటీఏ 5' పేరిట ఉన్న రికార్డును ఇది బద్దలు కొట్టింది. వినోద రంగ చరిత్రలోనే అతిపెద్ద విడుదలలో ఒకటిగా సరికొత్త మైలురాయిని లిఖించింది. ప్రీ-రిలీజ్ బుకింగ్స్, మొదటి రోజు కొనుగోళ్ల ద్వారా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 3.25 కోట్ల కాపీలు అమ్ముడైనట్లు గేమ్ డెవలపర్ రాక్‌స్టార్ గేమ్స్ అధికారికంగా వెల్లడించింది. 2013లో విడుదలైన 'జీటీఏ 5' మొదటి రోజు సాధించిన 800 మిలియన్ డాలర్ల ఆదాయంతో పోలిస్తే ఇది దాదాపు ఐదు తరువాయి 2 వ పేజీలో...

25 నుంచి అగ్రిగోల్డ్ బాండ్ల వెరిఫికేషన్

తెలంగాణ వ్యాప్తంగా 10 ప్రత్యేక కేంద్రాలు

హైదరాబాద్, నవంబర్ 21 (ఈవార్తలు):
అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల పరిశీలనకు తెలంగాణ సీఐడీ సిద్ధమైంది. నవంబర్ 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 10 ప్రత్యేక కేంద్రాల్లో డిపాజిట్ బాండ్ల వెరిఫికేషన్, రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. డిపాజిటర్లు, బాధితులు, వారి చట్టబద్ధమైన వారసులకు న్యాయం అందించే చర్యల్లో భాగంగా ఈ ప్రక్రియ చేపట్టనుంది. రాష్ట్రంలో సుమారు 1.65 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులు ఉన్నట్లు సీఐడీ గుర్తించింది.

రూ.447 కోట్లకు సంబంధించిన ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సమాచారం. బాధితుల సౌకర్యార్థం హైదరాబాద్, ఖమ్మం, కొత్తగూడెం, వరంగల్, మహబూబ్‌నగర్, నల్గొండ, తరువాయి 2 వ పేజీలో...

స్టార్ హెల్త్‌కు రూ.2 కోట్ల జరిమానా

కారణం చెప్పకుండా క్లెయిమ్‌లు తిరస్కరణ ఎఫెక్ట్

న్యూఢిల్లీ, నవంబర్ 21 (ఈవార్తలు):
ఆరోగ్య బీమా పాలసీదారుల ప్రయోజనాలను దెబ్బతీసేలా అనవసర కారణాలతో క్లెయిమ్‌లను తిరస్కరించడం, నిబంధనలకు విరుద్ధం గా బిల్లుల్లో కోతలు విధించినందుకుగానూ స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీపై భారత బీమా నియంత్రణ, అభివృద్ధి అథారిటీ (ఐఆర్‌డీఏఐ) రూ. 2 కోట్ల భారీ జరిమానా విధించింది.

2022లో నిర్వహించిన తనిఖీలు, తదుపరి విచారణల అనంతరం ఈ ఉత్తర్వులు జారీ చేసిన ఐఆర్‌డీఏఐ, కోవిడ్-19 క్లెయిమ్‌లతో సహా పలు క్లెయిమ్‌లను సరైన కారణం లేకుండానే తిరస్కరించినందుకు రూ. 1 కోటి, అలాగే ఏ నిబంధన కింద తరువాయి 2 వ పేజీలో...

విశ్వవాణి



మనుషులు విచ్చలవిడిగా భూగర్భ జలాలను తోడేయడం భూమి భ్రమణంపైనా ప్రభావం చూపుతోందని శాస్త్రవేత్తలు గుర్తించారు. వ్యవసాయ సాగునీరు, ఇతర అవసరాల కోసం భారీ మొత్తంలో భూగర్భ జలాలను వెలికితీయడం వల్ల భూమిపై నీటి పంపిణీలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ మార్పుల కారణంగా భూమి భ్రమణ ధ్రువం స్వల్పంగా కదిలినట్లు పరిశోధనలు వెల్లడించాయి. 1993 నుంచి 2010 మధ్య ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2,150 గిగాటన్నుల భూగర్భ జలాలను మనుషులు వెలికితీసినట్లు పరిశోధకులు అంచనా వేశారు. ఈ నీటిలో అధిక భాగం చివరకు సముద్రాల్లోకి చేరడంతో భూమిపై ద్రవ్యరాశి పంపిణీ మారింది.

హెచ్-1బీ ఉద్యోగుల పిల్లలకు గ్రీన్ కార్డ్!

21 ఏళ్లు నిండినా అమెరికాలోనే ఉండేలా కొత్త బిల్లు

భారతీయ కుటుంబాలకు ఊరట కలిగించే ప్రతిపాదన



వాషింగ్టన్, నవంబర్ 21:
అమెరికాలో హెచ్-1బీ వీసాలపై పనిచేస్తున్న భారతీయ నిపుణుల పిల్లలకు గ్రీన్ కార్డ్ పొందే అవకాశం కల్పించే ప్రతిపాదన మరోసారి చర్చకు వచ్చింది. తల్లిదండ్రుల గ్రీన్ కార్డ్ కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తూ, 21 ఏళ్లు నిండగానే డిపెండెంట్ వీసా హోదా కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్న యువతకు శాశ్వత నివాస హక్కులు కల్పించేందుకు ఉద్దేశించిన 'అమెరికన్ డ్రీమ్ అండ్ ప్రామిస్ యాక్ట్-2025' బిల్లును ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని అమెరికా ప్రతినిధుల సభ డెమోక్రటిక్ నేత హకీమ్ జెఫ్రీస్ ప్రకటించారు. ప్రస్తుత కాంగ్రెస్‌లోనే బిల్లుపై ఓటింగ్ నిర్వహించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.

అయితే బిల్లు ఇంకా చట్టంగా మారలేదు. అమెరికాలో హెచ్-1బీ వీసాలపై ఉద్యోగాలు చేస్తున్న విదేశీయుల పిల్లలు సాధారణంగా హెచ్-4 డిపెండెంట్ వీసాపై నివసిస్తుంటారు. అయితే 21 ఏళ్లు నిండిన తర్వాత ఈ హోదాను కొనసాగించుకునే అవకాశం సాధారణంగా ఉండదు. ఇమ్మిగ్రేషన్ నిబంధనల్లో ఈ పరిస్థితిని 'ఏజింగ్ అవుట్'గా పిలుస్తారు. కొన్ని సందర్భాల్లో చైల్డ్ స్టేటస్ ప్రొటెక్షన్ తరువాయి 2 వ పేజీలో...

ఐఐటీ ఖరగ్‌పూర్‌కు గూగుల్ రూ.46 కోట్ల సాయం

ఏఐ పరిశోధనలకు భారీ మద్దతు

భారతీయ భాషలు, వ్యవసాయం, విద్యకు ప్రాధాన్యం



న్యూఢిల్లీ, నవంబర్ 21:
భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిశోధనలను ప్రోత్సహించేందుకు గూగుల్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు కథనాలు వెల్లడించాయి. ఐఐటీ ఖరగ్‌పూర్‌కు ఐదు మిలియన్ డాలర్లు, భారత కరెన్సీలో సుమారు రూ.46.34 కోట్ల ఆర్థిక సాయం అందించనున్నట్లు గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ప్రకటించినట్లు పేర్కొన్నాయి. ఈ నిధులతో భారతీయ భాషలు, వ్యవసాయం, విద్య వంటి రంగాల్లో ఏఐ ఆధారిత పరిశోధనలకు మరింత ప్రోత్సాహం లభించనుంది. ఐఐటీ ఖరగ్‌పూర్ పూర్వ విద్యార్థి అయిన సుందర్ పిచాయ్ ఈ సహకారంపై స్పందిస్తూ ఏఐ ప్రయోజనాలు సమాజంలోని ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రస్తావిస్తున్న అందరికీ ఏఐ ప్రయోజనాలు అందాలనే లక్ష్యానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ నిధులను ప్రధానంగా మూడు విభాగాల్లో వినియోగించనున్నట్లు సమాచారం. అత్యాధునిక ఏఐ పరిశోధనలను ప్రోత్సహించడం, విద్యార్థులకు పరిశోధన అవకాశాలు కల్పించడం, ఐఐటీ తరువాయి 2 వ పేజీలో...

విమానం క్యాబిన్‌లోకి ఇరుముడి

అయ్యప్ప భక్తులకు కేంద్రం గుడ్ న్యూస్

న్యూఢిల్లీ, నవంబర్ 21:
శబరిమల యాత్ర చేపట్టే అయ్యప్ప భక్తులకు కేంద్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. విమానాల్లో ప్రయాణించే సమయంలో పవిత్రమైన 'ఇరుముడి'ని క్యాబిన్ బ్యాగేజీగా తమ వెంట తీసుకెళ్లేందుకు అనుమతి మంజూరు చేసింది. భక్తుల మనోభావాలు, సాంప్రదాయాలను గౌరవిస్తూ వరుసగా మూడో ఏడాది కూడా ఈ సడలింపును కొనసాగిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అధికారికంగా వెల్లడించారు. శతాబ్దాలుగా అయ్యప్ప స్వామి భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఇరుముడిని వెంట తీసుకెళ్లడం ఆచారంగా వస్తోందని మంత్రి పేర్కొన్నారు. అయ్యప్ప స్వాములు తమ పవిత్ర యాత్రను ఎటువంటి అసౌకర్యాలు లేకుండా సాఫీగా కొనసాగించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ క్రమంలో బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ, సెంట్రల్ తరువాయి 2 వ పేజీలో...

22-11-2026 రాశి ఫలితాలు

మేషం: ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. చేపట్టిన పనులలో స్వల్ప ఆటంకాలు ఉంటాయి. ప్రయాణాలలో జాగ్రత్త అవసరం. సోదరులతో మాట పట్టింపులు ఉంటాయి. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగ స్థానచలన సూచనలున్నవి.

వృషభం: వ్యాపారమున పురోగతి సాధిస్తారు. ఉద్యోగమున పదోన్నతి పెరుగుతుంది. సన్నిహితులతో సఖ్యత కలుగుతుంది. ఆప్తుల నుండి విలువైన సమాచారం సేకరిస్తారు. దైవదర్శనాలు చేసుకుంటారు. సంఘంలో గౌరవ మర్యాదలకు లోటుండదు. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు.

మిథునం: ఆర్థిక విషయాలు ఆశాజనకంగా సాగుతాయి. దూరప్రాంతాల నుంచి శుభవార్తలు అందుతాయి. వ్యాపార, ఉద్యోగాలు అనుకూలంగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో గృహమున సంతోషంగా గడుపుతారు. మిత్రులతో విందువినోద కార్యక్రమాలలో పాల్గొంటారు.

కర్కాటకం: బంధువర్గంతో వివాదాలుంటాయి. చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమౌతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. పుణ్యక్షేత్రాలు సందర్శించుకుంటారు. వృధా ఖర్చులు పెరుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి.

సింహం: స్వల్ప ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. నూతన ఋణయత్నాలు చేస్తారు. ఇంటాబయట సమస్యలు కొంత బాధిస్తాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగులకు పని ఒత్తిడి పెరుగుతుంది. ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా పడుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి.

కన్య: వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. నూతన కార్యక్రమాలు చేపడతారు. ఆత్మీయులతో గృహమున ఆనందంగా గడుపుతారు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి.

తుల: దూరప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ముఖ్యమైన వ్యవహారాలు నిరాశ కలిగిస్తాయి. చేపట్టిన పనులలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. వ్యాపార, ఉద్యోగాలలో ఒత్తిడులు కొంత చికాకు పరుస్తాయి. స్థిరాస్తి ఒప్పందాలు వాయిదా పడతాయి.

వృశ్చికం: పోటీపరీక్షల్లో విజయం సాధిస్తారు. నూతన వ్యక్తుల పరిచయాలు లాభసాటిగా సాగుతాయి. నూతన వాహన యోగం ఉన్నది. వృత్తి, వ్యాపారాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. సంతాన విద్యా విషయాలలో శుభవార్తలు అందుతాయి. ఆర్థిక విషయాలు సంతృప్తినిస్తాయి.

ధనస్సు: వ్యాపార, ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి. బంధు వర్గం నుంచి ధనపరమైన ఒత్తిడులు పెరుగుతాయి. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. నిరుద్యోగులకు లభించిన అవకాశములు సద్వినియోగం చేసుకోవడంలో విఫలమౌతారు.

మకరం: వృత్తి, వ్యాపారాలలో సమస్యలు తొలుగుతాయి. నూతన ఋణ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. బంధు మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. సంఘంలో గౌరవ మర్యాదలకు లోటు ఉండదు. సన్నిహితుల నుండి అత్యంత కీలక సమాచారం అందుతుంది.

కుంభం: ఉద్యోగులు నూతనోత్సాహంతో పనిచేసి ప్రశంసలు అందుకుంటారు. ఆప్తుల నుంచి శుభవార్తలు అందుతాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు లాభసాటిగా సాగుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శించుకుంటారు. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగ్గా ఉంటుంది. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు.

మీనం: వ్యాపారాలలో ఊహించని మార్పులు ఉంటాయి. ఉద్యోగులకు బాధ్యతలు అధికమౌతాయి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహ పరుస్తుంది. కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. ధనాదాయ మార్గాలు పెరుగుతాయి. వృధా ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం.

ఫ్యామిలీలో ఒక్కరికే బీమా

(మొదటి పేజీ తరువాయి)

దరఖాస్తును స్వీకరిస్తారు. రేషన్ కార్డు ఈ-కేవైసీ పెండింగ్‌లో ఉంటే తమకు కేటాయించిన రేషన్ దుకాణంలో పూర్తి చేసుకోవాలి. రేషన్ కార్డు ఒక జిల్లాలో ఉండి మరో జిల్లాలో నివసిస్తున్న కుటుంబాలు దరఖాస్తు కోసం సొంత జిల్లాకు వెళ్లాల్సిన అవసరం లేదు. సమీపంలోని శిబిరంలోనే వివరాలు ఇవ్వొచ్చు. వాటిని కార్డు జారీ చేసిన జిల్లా అధికారులు పరిశీలిస్తారు. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న ఇతర బీమా పథకాలను కూడా కొనసాగిస్తూ ఇందిరమ్మ బీమా పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించింది. కుటుంబానికి ఇప్పటికే ఏదైనా ప్రభుత్వ పథకం ద్వారా బీమా ఉంటే ఆ వివరాలనూ దరఖాస్తులో నమోదు చేస్తారు.

నామినీలకు వాటా నిర్ణయించే అవకాశం

ఆన్‌లైన్‌లో నమోదై ఉన్న కుటుంబ సభ్యుల జాబితా నుంచి ఒకరిని లేదా అంతకంటే ఎక్కువ మందిని నామినీలుగా ఎంచుకోవచ్చు. ఒకరి కంటే ఎక్కువ మంది ఉంటే రూ.5 లక్షల పరిహారంలో ఎవరికి ఎంత వాటా ఇవ్వాలో బీమా పొందే వ్యక్తి నిర్ణయించవచ్చు. ఒక్కొక్కరి వాటాను పూర్ణ సంఖ్యల్లో శాతంగా నమోదు చేయాలి. వాటాల మొత్తం 100 శాతానికి మించకూడదు. ప్రతి నామినీ పేరు, వయసు లేదా పుట్టిన తేదీ, బీమా పొందే వ్యక్తితో ఉన్న సంబంధాన్ని నమోదు చేస్తారు. 18 ఏళ్లలోపు పిల్లలను కూడా నామినీలుగా ఎంచుకోవచ్చు. వారి తరఫున పరిహారం స్వీకరించేందుకు 18 ఏళ్లు నిండిన వ్యక్తిని 'అపాయింటీ'గా పేర్కొనాలి. కుటుంబం వెలుపలి వ్యక్తికి కూడా ఆ బాధ్యత అప్పగించవచ్చు. నమోదు పూర్తయ్యే ముందు బీమా పొందే వ్యక్తి, నామినీల వివరాలను సిబ్బంది కుటుంబ సభ్యులకు చూపించి ధ్రువీకరించుకుంటారు. నమోదు పూర్తయ్యాక ట్రాన్సాక్షన్ ఐడీతో మొబైల్‌కు రసీదు సందేశం వస్తుంది. కుటుంబ వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించకపోయినా, పత్రాల్లో తేడాలున్నా, సాంకేతిక సమస్య తలెత్తినా ఏం చేయాలో చెప్పకుండా దరఖాస్తుదారులను వెనక్కి పంపొద్దని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ప్రతి శిబిరంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలి లేదా ఫిర్యాదుల బాధ్యతను ఒక అధికారికి అప్పగించాలి. సమస్యను నమోదు చేసి, సవరణ కోసం ఎవరిని సంప్రదించాలో కుటుంబానికి తెలియజేయాలి. అక్కడ పరిష్కారం కాని ఫిర్యాదులను రోజువారీ జిల్లా సమీక్షలో పరిశీలిస్తారు. కుటుంబాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అదనపు శిబిరాలు నిర్వహించడంతో పాటు వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ప్రణాళికా శాఖ సూచించింది.

స్టార్ హెల్త్‌కు రూ.2 కోట్ల జరిమానా

(మొదటి పేజీ తరువాయి)

కోత విధించారో స్పష్టంగా చెప్పకుండా పాలసీదారులను అయోమయానికి గురిచేసినందుకు మరో రూ. 1 కోటి చొప్పున పెనాల్టీ వేసింది. అంతేకాకుండా, నెట్‌వర్క్ ఆసుపత్రులు ఇచ్చే డిస్కౌంట్లను బిల్లుల్లో చూపకపోవడం, గడువుకు 90 రోజుల ముందే రెన్యువల్ ప్రీమియం వసూలు చేయడం, అంబుడ్స్‌మన్ వివరాలను అందించకపోవడంపై సంస్థను కఠినంగా హెచ్చరించిన ఐఆర్‌డీఏఐ, ఇకపై క్లెయిమ్ సెటిల్‌మెంట్ లేఖల్లో ఆమోదించిన, తగ్గించిన, డిస్కౌంట్ చేసిన మొత్తాల వివరాలను స్పష్టంగా పేర్కొనాలని, ఈ ఉత్తర్వును కంపెనీ బోర్డు ముందు ఉంచి దిద్దుబాటు చర్యలపై నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

హెచ్-1బీ ఉద్యోగుల పిల్లలకు గ్రీన్ కార్డ్!

(మొదటి పేజీ తరువాయి)

యాక్ట్ కింద వయసు లెక్కింపులో రక్షణ లభించే అవకాశం ఉన్నప్పటికీ, అందరికీ అది వర్తించదు. ముఖ్యంగా భారతీయులకు ఉపాధి ఆధారిత గ్రీన్ కార్డుల కోసం భారీ వెయిటింగ్ లిస్ట్ ఉండటంతో సమస్య తీవ్రమవుతోంది. తల్లిదండ్రులు శాశ్వత నివాస హోదా పొందకముందే పిల్లలకు 21 ఏళ్లు నిండిపోతున్నాయి. దీంతో వారు అమెరికాలో కొనసాగాలంటే విద్యార్థి వీసా వంటి మరో చట్టబద్ధమైన హోదాకు మారాల్సి వస్తోంది. లేకపోతే దేశం విడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. చిన్నప్పటి నుంచి అమెరికాలోనే పెరిగి, అక్కడి పాఠశాలలు, కళాశాలల్లో చదువుకున్నప్పటికీ శాశ్వత నివాస హోదా లేని ఈ యువతను 'డాక్యుమెంటెడ్ డ్రీమర్స్'గా పిలుస్తారు. వీరి సమస్యకు పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో కొత్త చట్టపరమైన ప్రతిపాదనలు ముందుకు వస్తున్నాయి.



25 నుంచి అగ్రిగోల్డ్ బాండ్ల వెరిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

మంచిర్యాల, కరీంనగర్, నిజామాబాద్, మెదక్‌లో ప్రత్యేక వెరిఫికేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. డిపాజిటర్లు తమ జిల్లాలు, మండలాలకు కేటాయించిన షెడ్యూల్ ప్రకారం ఆయా కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది. అన్ని పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బాండ్ల పరిశీలన కొనసాగుతుంది. ఇందుకు సంబంధించిన తేదీలు, కేంద్రాలు, బాధ్యతలు నిర్వహించే అధికారుల వివరాలతో సీఐడీ షెడ్యూల్ విడుదల చేసింది. బాండ్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యే బాధితులు ఒరిజినల్ అగ్రిగోల్డ్ డిపాజిట్ బాండ్ లేదా నగదు రసీదుతో పాటు వాటి సంతకం చేసిన కలర్ జిరాక్స్ కాపీలను తీసుకెళ్లాలి. ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ వివరాలు, ఇటీవల తీసుకున్న పాస్‌పోర్ట్ సైజు ఫోటో, మొబైల్ నంబర్‌ను కూడా అందుబాటులో ఉంచుకోవాలి. అయితే ఒరిజినల్ బాండ్లను అధికారులకు అప్పగించాల్సిన అవసరం లేదని సీఐడీ స్పష్టం చేసింది. అసలు బాండ్లను పరిశీలించి ధ్రువీకరించిన తర్వాత తిరిగి డిపాజిటర్లకే అందజేస్తారు. సమర్పించిన జిరాక్స్ పత్రాలు, వివరాలకు సంబంధించి అధికారిక అక్నాలెడ్జ్‌మెంట్ రసీదు ఇస్తారు. అనారోగ్యం లేదా ఇతర కారణాలతో డిపాజిటర్లు స్వయంగా కేంద్రాలకు రాలేని పరిస్థితుల్లో వారి కుటుంబ సభ్యులు హాజరుకావచ్చు. అయితే డిపాజిటర్ ఇచ్చిన అథరైజేషన్ లెటర్‌తో పాటు కుటుంబ సంబంధాన్ని ధ్రువీకరించే పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అసలు డిపాజిటర్ మరణించి ఉంటే నామినీలు లేదా చట్టబద్ధమైన వారసులు వెరిఫికేషన్‌కు హాజరుకావచ్చు. ఇందుకు డెత్ సర్టిఫికెట్, వారసత్వ హక్కును నిర్ధారించే చట్టబద్ధమైన పత్రాలను అదనంగా సమర్పించాలి. ఏజెంట్లు బాండ్లను సమర్పించే సందర్భంలో వ్యక్తిగత బాండ్ల వివరాలు, గుర్తింపు పత్రాలు, బ్యాంకు వివరాలు, ఏజెంట్ కోడ్‌ను అందజేయాలి. బాధితులు తమ పరిధికి కేటాయించిన తేదీలను ముందుగానే తెలుసుకుని అవసరమైన పత్రాలతో వెరిఫికేషన్ కేంద్రాలకు రావాలని సీఐడీ సూచించింది. బాండ్ల పరిశీలన ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు అందరూ సహకరించాలని కోరింది.

ఐఐటీ ఖరగ్‌పూర్‌కు గూగుల్ రూ.46 కోట్ల సాయం

(మొదటి పేజీ తరువాయి)

ఖరగ్‌పూర్‌లో ఏఐ పరిశోధన సామర్థ్యాన్ని పెంచడం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. భారతీయ భాషలకు సంబంధించిన సాంకేతిక పరిష్కారాల అభివృద్ధికి ఈ సహకారం ఉపయోగపడే అవకాశం ఉంది. వ్యవసాయ రంగంలో రైతులకు అవసరమైన సమాచారాన్ని అందించడం, విద్యారంగంలో కొత్త సాంకేతిక విధానాలను రూపొందించడం వంటి అంశాలపై పరిశోధనలు చేపట్టనున్నారు. వాస్తవ ప్రపంచ సమస్యలకు ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాలను రూపొందించడంలో విద్యాసంస్థలతో భాగస్వామ్యం కీలకమని గూగుల్ అభిప్రాయపడింది. బలమైన అకడమిక్ నాయకత్వం, పరిశోధన సహకారంతో అందరికీ ఉపయోగపడే ఏఐ వ్యవస్థలను అభివృద్ధి చేయవచ్చని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ రంగంలో పెట్టుబడులు పెరుగుతున్న సమయంలో ఐఐటీ ఖరగ్‌పూర్‌కు ప్రకటించిన ఈ ఆర్థిక మద్దతు భారత పరిశోధన రంగానికి ప్రాధాన్యమైన పరిణామంగా భావిస్తున్నారు.

పంజాబ్ పోలీసుల హత్యకు ఐఎస్ఐ గాలం

(మొదటి పేజీ తరువాయి)

పాత్ర పోషిస్తోంది. విలాసవంతమైన కార్లు, ఖరీదైన ఇళ్ల ముందు నిల్చున్న భట్టి, అతని అనుచరుల ఫొటోలను యువతకు చూపి, వారిని ఆకర్షిస్తున్నారు. ఇలాంటి జీవితం మీ సొంతమవుతుందని నమ్మించి నెట్‌వర్క్‌లోకి ఆహ్వానిస్తున్నారు. మొదట, అతి తక్కువ రిస్క్ ఉన్న చిన్న చిన్న పనులు అప్పగించి, కొంత డబ్బు చెల్లిస్తున్నారు. ఆ తర్వాత పెద్ద పనులు చేస్తే భారీగా డబ్బు ఇస్తామని ఆశ పెడుతున్నారు. ఒకసారి యువకులు ఈ వలలో చిక్కి, ఒకటి రెండు పనులు పూర్తి చేశాక అసలు కుట్ర మొదలవుతుంది. అప్పటికే వారు చేసిన నేరాల గురించి భద్రతా ఏజెన్సీలకు సమాచారం ఇస్తామని బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభిస్తారు. దీంతో భయపడిపోయిన యువకులు, ఐఎస్ఐ చెప్పిన పనులన్నీ చేయాల్సి వస్తోంది. ఎంత పెద్ద పని చేసినా, వారికి ఇచ్చేది మాత్రం నామమాత్రపు సొమ్మేనని అధికారులు వివరించారు. ఈ బ్లాక్‌మెయిల్‌తోనే వారిని మరింత ప్రమాదకరమైన పనుల్లోకి దింపుతున్నారు. భారీ ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రి రవాణా చేయిస్తున్నారు. చివరికి, కాంట్రాక్ట్ హత్యలు (హిట్ జాబ్స్) చేయడానికి కూడా బలవంతం చేస్తున్నారు. హత్య చేస్తే జీవిత ఖైదు లేదా మరణశిక్ష పడుతుందని తెలిసినా, ఐఎస్ఐ నెట్‌వర్క్ తమను పట్టించేస్తుందనే భయంతో, కుటుంబ పరువు పోతుందనే ఆందోళనతో యువకులు ఈ ఘోరాలకు పాల్పడుతున్నారు. గతేడాది పంజాబ్‌లో జరిగిన ఆరుగురు పోలీసుల హత్యల వెనుక స్థానిక యువత ప్రమేయం ఉన్నట్లు తేలింది. ఈ నెట్‌వర్క్‌ను పంజాబ్ నుంచి ఇతర ఉత్తరాది రాష్ట్రాలకు విస్తరించేందుకు ఐఎస్ఐ ప్రయత్నిస్తోంది. ఒక రాష్ట్రానికి చెందిన యువకులను మరో రాష్ట్రంలో నేరాలకు ఉపయోగించడం ద్వారా పోలీసుల నిఘా నుంచి సులభంగా తప్పించుకోవచ్చని భావిస్తోంది.

4000 మంది అగ్నివీరుల డేటా చోరీ

(మొదటి పేజీ తరువాయి)

చేశాడు. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో ఢిల్లీ పోలీసుల ఇంటెలిజెన్స్ ఫ్యూజన్ అండ్ స్ట్రాటజిక్ ఆపరేషన్స్ (ఐఎఫ్ఎస్ఓ) విభాగం వేగంగా స్పందించింది. హర్యానాలోని బల్లాభ్‌గఢ్‌కు చెందిన ఆ మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్స్‌ను ఉపయోగించి ఆ బాలుడు ఈ టెస్ట్ సైట్‌లోకి చొరబడినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. అతని వద్ద ఉన్న డిజిటల్ పరికరాల నుంచి చోరీకి గురైన మొత్తం డేటాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చోరీకి గురైన సమాచారం అసలైనదేనా? కాదా? అని నిర్ధారించుకునేందుకు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ) అధికారిక రికార్డులను పోలీసులు కోరారు. చట్టప్రకారం మైనర్ బాలుడిని ప్రాథమికంగా ప్రశ్నించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ డేటా ఉల్లంఘన తీవ్రత ఎంతవరకు ఉంది? ఇతర వివరాలు ఏవైనా లీక్ అయ్యాయా అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

విమానం క్యాబిన్‌లోకి ఇరుముడి

(మొదటి పేజీ తరువాయి)

ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్‌తో పాటు విమానాశ్రయాల నిర్వాహకులకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. పవిత్ర దీక్ష చేపట్టి యాత్రకు బయలుదేరే భక్తులందరికీ స్వామివారి ఆశీస్సులు ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ నిర్ణయానికి సంబంధించి కేంద్ర పౌర విమానయాన శాఖ అధికారిక ఉత్తర్వులను కూడా జారీ చేసింది. విమానాల్లో భద్రతా కారణాల దృష్ట్యా సాధారణంగా నిషేధించే వస్తువుల జాబితా నుంచి ఇరుముడికి మినహాయింపునిస్తూ గతంలో ఇచ్చిన ఆదేశాలు ఈ సీజన్‌లోనూ అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని విమానాశ్రయాల రీజినల్ కార్యాలయాలు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ప్రైవేట్ ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్లు నిబంధనలను పక్కాగా అమలు చేయాలని ఆదేశించింది.

జీటీఏ-6.. తొలిరోజే 31,000 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

రెట్లు ఎక్కువ కావడం విశేషం. అంతేకాకుండా హాలీవుడ్ చలనచిత్ర చరిత్రలో సంచలనం సృష్టించిన 'అవెంజర్స్: ఎండ్‌గేమ్' జీవితకాల ప్రపంచ బాక్సాఫీస్ వసూళ్లను (2.94 బిలియన్ డాలర్లు) కేవలం ఒక్క రోజులోనే ఈ గేమ్ దాటేసి సరికొత్త సంచలనం సృష్టించింది. కల్పిత వైస్ సిటీ నేపథ్యంలో లూసియా, జాసన్ బ్లిట్జ్ అనే నేర పాత్రల చుట్టూ ఈ గేమ్ కథనం సాగుతుంది. రాక్‌స్టార్ గేమ్స్ మాతృ సంస్థ టేక్-టూ ఇంటరాక్టివ్ ఈ గేమ్‌ను దాదాపు 1 బిలియన్ డాలర్ల భారీ బడ్జెట్‌తో నిర్మించింది. దీన్ని ఆడేందుకు ప్రపంచవ్యాప్తంగా గేమర్లు తమ ఉద్యోగాలకు ప్రత్యేక సెలవులు పెట్టడంతో పాటు, తమకు అంతరాయం కలిగించకుండా కుటుంబ సభ్యులతో ముందస్తు ఒప్పందాలు చేసుకుంటున్నారంటే క్రేజ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పీసీ వెర్షన్‌తో పాటు ఆన్‌లైన్ మల్టీప్లేయర్ సదుపాయాలు 2027 నాటికి అందుబాటులోకి రావచ్చని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

సవాళ్లతో సావాసం చేస్తా

(మొదటి పేజీ తరువాయి)

సామర్థ్యాన్ని గుర్తిస్తాయని పేర్కొన్నారు. దేశంలో పేదరికాన్ని ఒకప్పుడు పరిష్కారం లేని సమస్యగా భావించేవారని మోదీ అన్నారు. భారీ జనాభా ఉన్న భారత్‌లో పేదరికాన్ని తగ్గించడం సాధ్యం కాదనే అభిప్రాయం ఉండేదని గుర్తుచేశారు. అయితే తమ ప్రభుత్వం ఆ ఆలోచనా విధానాన్ని మార్చి పేదల సాధికారతకు ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. పేద కుటుంబాలకు మరుగుదొడ్ల నిర్మాణం వంటి కనీస సౌకర్యాలు కల్పించడంపై దృష్టిపెట్టామని చెప్పారు. తాను మరుగుదొడ్ల గురించి మాట్లాడినప్పుడు కొందరు విమర్శించారని, కానీ పేదల ఆత్మగౌరవానికి అవి ఎంత అవసరమో గుర్తించలేదని వ్యాఖ్యానించారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అనేక పథకాలు అమలు చేశామని వివరించారు. గత 12 నుంచి 13 ఏళ్లలో భారత్‌లో దాదాపు 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడినట్లు ప్రపంచ బ్యాంకు నివేదిక వెల్లడించిందని ప్రధాని పేర్కొన్నారు. ఇది చిన్న మార్పు కాదని, పరిమితులను అధిగమించాలనే ఆలోచనతో పనిచేసిన ఫలితమని అభివర్ణించారు.

నాలుగేళ్లలో సెమీకండక్టర్ రంగంలో పురోగతి

సెమీకండక్టర్ రంగంలో భారత్ సాధించిన పురోగతిని కూడా మోదీ ప్రస్తావించారు. ఐదు దశాబ్దాల క్రితమే ఈ రంగంలో అవకాశాలు వచ్చినప్పటికీ దేశం వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయిందన్నారు. ఇతర దేశాలు ఎంతో ముందుకెళ్లిన తర్వాత భారత్ సెమీకండక్టర్ల తయారీలోకి ప్రవేశించడం వల్ల ప్రయోజనం ఏమిటని కొందరు ప్రశ్నించారని చెప్పారు. అయితే గతంలో ఆలస్యమైందనే కారణంతో ఇప్పుడు కూడా చేతులు ముడుచుకుని కూర్చోవడం సరికాదని భావించామని తెలిపారు. సెమీకండక్టర్ మిషన్ ద్వారా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లామని, నాలుగేళ్లలో దేశవ్యాప్తంగా పలు తయారీ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. భారత్ చిప్‌లను ఎగుమతి చేసే స్థాయికి చేరుకుందని, ఈ రంగంలోని అనేక సంస్థల్లో ఐఐటీ ఖరగ్‌పూర్ పూర్వ విద్యార్థులు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని చెప్పారు.

యువతకు అంతరిక్ష రంగంలో అవకాశాలు

అంతరిక్ష రంగంలో తీసుకొచ్చిన మార్పులను ప్రధాని వివరించారు. గతంలో అంతరిక్ష పరిశోధనలు ప్రధానంగా ఇస్రో పరిధిలోనే కొనసాగేవని, బయట ఉన్న యువ పరిశోధకులకు అవకాశాలు పరిమితంగా ఉండేవని అన్నారు. ఆ పరిస్థితిని మార్చేందుకు ప్రైవేటు రంగానికి అవకాశాలు కల్పించామని తెలిపారు. ఐఐటీ ఖరగ్‌పూర్ పూర్వ విద్యార్థి పవన్ స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థను ఏర్పాటు చేసి భారత తొలి ప్రైవేటు రాకెట్ ప్రయోగంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ప్రస్తుతం అనేక స్పేస్ స్టార్టప్‌లు దేశ అంతరిక్ష కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నాయని చెప్పారు. గతంలో అసాధ్యమనుకున్న పనులు ఇప్పుడు సాధ్యమవుతున్నాయని పేర్కొన్నారు.

2047 లక్ష్యంగా యువత పనిచేయాలి

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ఏర్పాటైన తొలి ఐఐటీగా ఖరగ్‌పూర్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని మోదీ అన్నారు. దేశం ఎడ్లబండ్ల కాలం నుంచి బుల్లెట్ రైళ్ల దిశగా సాగుతున్న 75 ఏళ్ల ప్రయాణంలో ఈ విద్యాసంస్థ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. అంతరిక్షం, అణుశక్తి, సమాచార సాంకేతిక రంగాల్లో ఇక్కడి విద్యార్థులు విశేషంగా సేవలందించారని ప్రశంసించారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంలో రాబోయే రెండు దశాబ్దాలు ఎంతో కీలకమని ప్రధాని చెప్పారు. ప్రస్తుత విద్యార్థుల్లో అనేకమంది అప్పటికి వివిధ రంగాల్లో నాయకత్వ స్థానాల్లో ఉంటారని పేర్కొన్నారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యల్లో తాము దేనికి పరిష్కారం చూపగలమో ప్రతి విద్యార్థి ఆలోచించాలని సూచించారు. దేశ ప్రయోజనాలను ముందుంచి పనిచేస్తే వ్యక్తిగతంగా కూడా కొత్త అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఐఐటీ ఖరగ్‌పూర్ వందేళ్ల వేడుకలను అభివృద్ధి చెందిన భారత్‌లో నిర్వహించుకునేలా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. లక్ష్యాన్ని చేరుకునే వరకు ఆగవద్దన్న స్వామి వివేకానంద సందేశాన్ని గుర్తుచేస్తూ మోదీ పేర్కొన్నారు.

కేసీఆర్ ఫామ్‌హౌస్ భూముల లెక్కలు బయటపెడతాం

అసెంబ్లీ వేదికగా పూర్తి వివరాలు వెల్లడిస్తాం.. భూముల సర్వే దాదాపు పూర్తయిందన్న మంత్రి పొంగులేటి

కాళేశ్వరం బరాజ్‌ల నిర్మాణంపైనా తీవ్ర ఆరోపణలు

హైదరాబాద్, నవంబర్ 21 (ఈవార్తలు): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు సంబంధించిన భూముల వివరాలను త్వరలోనే అసెంబ్లీ వేదికగా బయటపెడతామని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. ఆ భూముల సర్వే ప్రక్రియ దాదాపు పూర్తయిందని వెల్లడించారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ భూముల సర్వే ప్రారంభం కాగానే మాజీ మంత్రి హరీశ్‌రావు మామ తన భూమికి సంబంధించి కోర్టును ఆశ్రయించి ముందస్తు స్టే తెచ్చుకున్నారని పేర్కొన్నారు. భూముల వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు తెలియజేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో భూభారతి పోర్టల్‌కు సంబంధించిన సాంకేతిక సమస్యలు కూడా దాదాపు పరిష్కారమయ్యాయని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా ప్రజాధనాన్ని వృథా చేసిందని పొంగులేటి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్)లో డయాఫ్రమ్ వాల్ నిర్మిస్తామని పేర్కొని, ఆ తర్వాత మూడు బరాజ్‌ల్లో సికెంట్ పైల్స్ ఉపయోగించారని విమర్శించారు. ఇందుకు అవసరమైన అనుమతులు తీసుకోలేదని ఆరోపించారు. సికెంట్ పైల్స్ వినియోగించడం వల్లే బరాజ్‌లు కుంగిపోయాయని పేర్కొన్నారు. డయాఫ్రమ్ వాల్ నిర్మించకుండా సికెంట్ పైల్స్ ఎందుకు ఉపయోగించారో కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం

తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని పొంగులేటి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో తాను సౌకర్యవంతంగా ఉన్నానని, ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలో తమకు తెలుసని వ్యాఖ్యానించారు. సరైన సమయంలో రాజకీయ పోరాటం చేసి విజయం సాధిస్తామని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి ఎన్ని రాజకీయ ప్రయత్నాలు చేసినా కాంగ్రెస్ విజయాన్ని అడ్డుకోలేవన్నారు. తెలంగాణలో బీజేపీకి భవిష్యత్తు లేదని, ప్రస్తుతం ఉన్న ఎనిమిది మంది ఎమ్మెల్యేలను



కాపాడుకుంటేనే ఆ పార్టీకి గొప్ప విషయమని ఎద్దేవా చేశారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

హే రామ్..
ఆంధ్రప్రదేశ్‌ను కాపాడు!

స్థానిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్న జగన్



అమరావతి, నవంబర్ 21 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. అధికార కూటమి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆరోపించారు. ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకోవడం, దాఖలు చేసిన నామినేషన్లను చించివేయడం, పోలింగ్ కేంద్రాలను ఆక్రమించడం వంటి ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు జరిగే పరిస్థితి లేదని విమర్శిస్తూ 'హే రామ్.. ఆంధ్రప్రదేశ్‌ను కాపాడు' అంటూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. మున్సిపల్, జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలతో పాటు పార్టీ రహితంగా జరిగే పంచాయతీ ఎన్నికల్లోనూ అధికార కూటమి అక్రమాలకు పాల్పడుతోందని జగన్ ఆరోపించారు. ప్రతిపక్ష అభ్యర్థుల నామినేషన్లను అధికారులే చించివేస్తున్నారని, పోలింగ్ కేంద్రాలను ఆక్రమించి ఓట్లను అపహరిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులను కూడా ఓడినట్లు ప్రకటిస్తున్నారని ఆరోపించారు. రిటర్నింగ్ అధికారులు, పోలీసులు, అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘం కూడా అధికార పార్టీ చర్యలను అడ్డుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిలపై హత్యాయత్నాలు జరిగాయని జగన్ ఆరోపించారు. తాడిపత్రిలో పెద్దారెడ్డి ఇంటిపై స్థానిక టీడీపీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. పోలీసుల సమక్షంలోనే వాహనాలకు నిప్పంటించి హత్య చేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. దాడులకు పాల్పడినవారికి ప్రభుత్వం అండగా నిలుస్తూ బాధితులపైనే కేసులు నమోదు చేస్తోందని విమర్శించారు. గత ఐదేళ్ల తమ పాలనలో రాష్ట్రం ప్రశాంతంగా ఉండేదని, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో హింసాత్మక ఘటనలు పెరిగిపోయాయని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో జరిగినట్లు చెబుతున్న పలు ఘటనలకు సంబంధించిన వీడియోలను జగన్ తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు.

ఒక్క కొత్త పింఛను ఇచ్చినా రాజీనామా

సీఎం రేవంత్‌కు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సవాల్

హైదరాబాద్, నవంబర్ 21 (ఈవార్తలు): హుజూరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క కొత్త పింఛను కూడా మంజూరు చేయలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. నియోజకవర్గంలో కొత్త పింఛను మంజూరు చేసినట్లు నిరూపిస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. అలా నిరూపించలేకపోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేస్తారా అని ప్రశ్నించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కౌశిక్‌రెడ్డి మాట్లాడారు. హుజూరాబాద్‌లో కొత్త పింఛన్లు ఇవ్వకపోగా, గతంలో మంజూరైన పింఛన్లను కూడా తొలగిస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో 1,029 చేయూత పింఛన్లను రద్దు చేశారని పేర్కొన్నారు. అర్హులైన పేదలకు పింఛన్లు అందకుండా చేయడం అన్యాయమని విమర్శించారు. తన నియోజకవర్గంలో పింఛను లబ్ధిదారుల సంఖ్య పెరిగిందని ప్రభుత్వం ఆధారాలతో నిరూపిస్తే క్షమాపణ చెప్పి ఎమ్మెల్యే పదవి నుంచి తప్పుకుంటానని ప్రకటించారు. ప్రభుత్వం ఆ వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చామని కౌశిక్‌రెడ్డి తెలిపారు. వృద్ధులకు రూ.200గా ఉన్న పింఛనును కేసీఆర్ రూ.2 వేలకు పెంచారని, దివ్యాంగులకు రూ.4 వేల వరకు అందించారని గుర్తుచేశారు. గతంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెలా 45 లక్షల మందికి పింఛన్లు అందేవని పేర్కొన్నారు.

పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు

రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలపై మహేశ్‌గౌడ్ స్పందన

హైదరాబాద్, నవంబర్ 21 (ఈవార్తలు): కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణను ఉల్లంఘించే నాయకులపై చర్యలు తప్పవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఏఐసీసీ నిశితంగా పరిశీలిస్తోందని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం కొంచెం ఎక్కువైందని మహేశ్‌గౌడ్ వ్యాఖ్యానించారు. అయితే పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే క్రమశిక్షణ చర్యలు తీసుకునే అంశాన్ని అధిష్ఠానం చూసుకుంటుందని స్పష్టం చేశారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి రాష్ట్రంలో బీజేపీ బలంగా ఉందంటూ చేసిన వ్యాఖ్యలు, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రభుత్వ పనితీరు, స్థిరత్వంపై వ్యక్తం చేసిన అభిప్రాయాలు పార్టీలో చర్చకు దారితీశాయి. ఈ నేపథ్యంలో మహేశ్‌గౌడ్ స్పందించారు. గతంలో కొండా సురేఖ వ్యవహారంలోనూ వెంటనే చర్యలు తీసుకోలేదని, పలుమార్లు హెచ్చరించిన తర్వాతే నిర్ణయం తీసుకున్నామని గుర్తుచేశారు.



తిరుచానూరు బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు

తిరుపతి, నవంబర్ 21 (ఈవార్తలు): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేపడుతోంది. డిసెంబర్ 6 నుంచి 14 వరకు జరిగే ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో దర్శనం, రవాణా, తాగునీరు, వైద్యం, పారిశుద్ధ్యం, భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టింది. శనివారం తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి భవనంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర అధికారులతో సమీక్ష నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలకమైన పంచమితీర్థం సందర్భంగా లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక క్యూలైన్లు, కంపార్ట్‌మెంట్లు, జర్మన్ షెడ్లు ఏర్పాటు చేయాలని ఈవో ఆదేశించారు. భక్తులను విడతలవారీగా పుష్కరిణిలోకి అనుమతించాలని సూచించారు. స్నానఘట్టాల వద్ద రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక బృందాలను నియమించాలని చెప్పారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను వేర్వేరుగా ఏర్పాటు చేసి బారికేడ్లు, భద్రతా సిబ్బందితో పర్యవేక్షించాలని ఆదేశించారు. తొక్కిసలాటకు అవకాశం లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. తిరుమల నుంచి తిరుచానూరు వరకు పడి ఊరేగింపు జరిగే మార్గాల్లో రహదారుల మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. ఉత్సవాల సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని పూలు, విద్యుద్దీపాలతో అలంకరించనున్నారు. వాహనసేవలను భక్తులందరూ వీక్షించేలా ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని ఈవో కోరారు. సమావేశంలో జేఈవోలు ఏ.శరత్, ప్రభల గోపీనాథ్, సీవీఎస్వో కేవీ మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో హరింద్రనాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ గెలిస్తే కుల సంఘాలకు
శాశ్వత భవనాలు

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో నిర్మిస్తామన్న బండి సంజయ్



కరీంనగర్, నవంబర్ 21 (ఈవార్తలు): తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తే కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని కుల సంఘాలకు శాశ్వత భవనాలు నిర్మించి ఇస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ హామీ ఇచ్చారు. అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్య, వైద్య సేవలు అందిస్తామని ప్రకటించారు. శనివారం కరీంనగర్‌లోని పద్మశాలి సంఘం భవనం పైఅంతస్తులో నూతనంగా నిర్మించిన గదులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలో లేకపోయినా ఎంపీ లాడ్స్ నిధుల ద్వారా పద్మశాలి సంఘం భవన నిర్మాణానికి సహకరించానని తెలిపారు. ఇతర కుల సంఘాలకు కూడా తనవంతు సాయం అందించినట్లు చెప్పారు. కమ్యూనిటీ హాళ్ల నిర్మాణంతో పాటు ఆలయాలు, పాఠశాలలు, ఆసుపత్రుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ సంక్షోభంలోకి వెళ్లిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఆ రెండు పార్టీలు విఫలమయ్యాయని ఆరోపించారు.

ఓటర్ల జాబితా సవరణపై అభ్యంతరమెందుకు?

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్ అనవసర వివాదం సృష్టిస్తోందని బండి సంజయ్ విమర్శించారు. చనిపోయిన వారి పేర్లు, ఒకటి కంటే ఎక్కువచోట్ల ఓట్లు ఉన్నవారి పేర్లను తొలగించడంలో తప్పేముందని ప్రశ్నించారు. అక్రమంగా ఓటర్ల జాబితాలో చేరినవారిని గుర్తించాలని, 18 ఏళ్లు నిండిన అర్హులైన భారతీయులందరికీ ఓటు హక్కు కల్పించాలని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాను సరిచేసే ప్రక్రియపై కాంగ్రెస్‌కు ఎందుకు అభ్యంతరమని నిలదీశారు. ఎస్ఐఆర్‌పై ప్రజలకు వాస్తవాలను వివరించేందుకు నవంబర్ 23న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కరీంనగర్‌కు వస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే మహా పాదయాత్రను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

కిచెన్లలో బొద్దింకలు..
నాలుగు హోటళ్లపై వేటు

హైదరాబాద్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

135 కిలోల నాసిరకం ఆహార పదార్థాల స్వాధీనం



హైదరాబాద్, నవంబర్ 21 (ఈవార్తలు): నగరంలోని పలు ప్రముఖ రెస్టారెంట్లలో ఆహార భద్రతా నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘిస్తున్నట్లు గుర్తించిన తెలంగాణ ఫుడ్ సేఫ్టీ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. వంటగదుల్లో అపరిశుభ్ర పరిస్థితులు, ఆహార పదార్థాల నిల్వలో లోపాలు బయటపడటంతో నాలుగు రెస్టారెంట్ల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులను సస్పెండ్ చేశారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మరో బేకరీ, హాస్టల్‌ను మూసివేయించారు. లైసెన్సులు సస్పెండ్ అయిన వాటిలో మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని మాదాపూర్ బావర్చి, కూకట్‌పల్లిలోని ది స్పైస్ కిచెన్, టోలిచౌకిలోని మతామ్ అల్ యమాని అరేబియన్ రెస్టారెంట్, చందానగర్‌లోని అన్నపూర్ణ క్యాటరర్స్ ఉన్నాయి. ఈ సంస్థలు తమ వ్యాపార కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని అధికారులు ఆదేశించారు. తనిఖీల్లో వంటగదుల్లో బొద్దింకలు, ఎలుకల విసర్జితాలు కనిపించినట్లు అధికారులు తెలిపారు. ఫ్రిడ్జ్‌లలో శాకాహారం, మాంసాహారాన్ని నిబంధనలకు విరుద్ధంగా కలిపి నిల్వ ఉంచినట్లు గుర్తించారు. నాసిరకం సింథటిక్ ఫుడ్ కలర్స్ వినియోగం, దెబ్బతిన్న కిచెన్ నేలలు, పొగతో నిండిన గోడలు వంటి లోపాలు బయటపడ్డాయి. ఆహారం తయారుచేసే సిబ్బందికి అవసరమైన వైద్య పరీక్షల ధ్రువపత్రాలు కూడా లేవని గుర్తించారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు లేదా రిజిస్ట్రేషన్లు లేకుండా నిర్వహిస్తున్న టోలిచౌకిలోని అల్ కరీమ్ బేకర్స్, గౌలిదొడ్డిలోని లక్ష్మి లగ్జరీ మెన్స్ హాస్టల్‌ను మూసివేయించారు. తనిఖీల సందర్భంగా కల్తీ జరిగినట్లు అనుమానిస్తున్న ఎనిమిది ఆహార నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. దాదాపు 135 కిలోల నాణ్యతలేని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. రాజు గారి బిర్యానీ, స్వాద్ స్పైసీ రెస్టారెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మెహఫిల్ రెస్టారెంట్‌కు లోపాలను సరిదిద్దుకోవాలని ఇంప్రూవ్‌మెంట్ నోటీసు ఇచ్చారు. లైసెన్సులు పునరుద్ధరించే వరకు సస్పెన్షన్‌కు గురైన నాలుగు రెస్టారెంట్లను తమ ప్లాట్‌ఫామ్‌ల నుంచి తొలగించాలని స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీ సంస్థలను ఆదేశించారు.

కాంగ్రెస్ పాలనలో పల్లెలకు నిధుల కటకట!

ఆర్బీఐ నివేదికను ప్రస్తావిస్తూ కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్, నవంబర్ 21 (ఈవార్తలు): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ పంచాయతీల ఆర్థిక పరిస్థితి దిగజారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ పాలనలో అభివృద్ధి బాటలో సాగిన గ్రామాలు ఇప్పుడు నిధుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆరోపించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన 'ఫైనాన్సెస్ ఆఫ్ పంచాయతీరాజ్ ఇన్‌స్టిట్యూషన్స్' నివేదికను ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలో ఒక్కో గ్రామ పంచాయతీ సగటున రూ.16.59 లక్షలు ఖర్చు చేసిందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో 2024-25 నాటికి ఆ మొత్తం రూ.6.24 లక్షలకు తగ్గిపోయిందని తెలిపారు. ఈ గణాంకాలే రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి ఎంతగా దెబ్బతిన్నదో తెలియజేస్తున్నాయని వ్యాఖ్యానించారు. ప్రజలు చెల్లిస్తున్న పన్నులు, ప్రభుత్వం తీసుకుంటున్న అప్పులు అభివృద్ధి పనులకు ఉపయోగపడటం లేదని ఆరోపించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నిధులు అందడం లేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి పాలనలో పల్లెల నుంచి పట్టణాల వరకు అభివృద్ధి కనిపించడం లేదని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు.

ఉద్యోగం వచ్చిన వారానికే అనంతలోకాలకు

అమెరికాలో రోడ్డు ప్రమాదంలో నల్గొండ యువకుడి మృతి

మునుగోడు, నవంబర్ 21 (ఈవార్తలు): ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి ఉద్యోగం సంపాదించిన నల్గొండ జిల్లా యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఉద్యోగం వచ్చిన వారం రోజులకే ఈ విషాదం చోటుచేసుకోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. మునుగోడు పట్టణానికి చెందిన ఈరమళ్ల ప్రసాద్, శ్రీకన్య దంపతుల పెద్ద కుమారుడు సాయితేజ (25) ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. సాయితేజ ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లాడు. చదువు పూర్తి చేసుకున్న తర్వాత ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించాడు. వారం రోజుల క్రితమే అతడికి ఉద్యోగం లభించింది. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేయడంతో కుటుంబమంతా ఆనందంలో మునిగిపోయింది. అయితే ఆ సంతోషం ఎంతోకాలం నిలవలేదు. కార్యాలయం నుంచి ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో సాయితేజ ప్రయాణిస్తున్న కారుకు అకస్మాత్తుగా జింక అడ్డువచ్చింది. కారు జింకను ఢీకొట్టడంతో అదుపుతప్పింది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ఇతర వాహనాలు కారును బలంగా ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో సాయితేజ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదం జరిగిన వెంటనే అతడిని స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. స్నేహితుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. కుమారుడికి ఉద్యోగం వచ్చిందని ఆనందపడిన తల్లిదండ్రులకు అతడి మరణవార్త తీరని శోకాన్ని మిగిల్చింది. సాయితేజ మృతితో మునుగోడులో విషాదం నెలకొంది.

చెరువులను కాపాడాలి: జీవన్ రెడ్డి

జగిత్యాల, నవంబర్ 21 (ఈవార్తలు): చెరువులు, కుంటలను ఆక్రమణలు, కాలుష్యం నుంచి కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి కోరారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మత్స్యకార సంఘాల నాయకులు ఆయనను కలిసి చేపలు అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ చెరువులు, కుంటలను సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని సూచించారు. చెరువుల్లోకి మురుగునీరు చేరకుండా ఎస్టీపీలను ఏర్పాటు చేయాలని కోరారు. మోతే, ముప్పల, చింతకుంట తదితర చెరువుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. చేప పిల్లల పంపిణీకి బదులుగా మత్స్యకార సంఘాలకు నగదు అందజేస్తే ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. మత్స్యకారుల సంక్షేమం, ఉపాధి అవకాశాల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘాల నాయకులు తోపరపు రజనీకాంత్, అరుముల్ల నారాయణ, పల్లికొండ రాజు తదితరులు పాల్గొన్నారు.





ముగ్గురికి రూ.4.20 లక్షల వైద్యసాయం

ఎల్ఓసీ పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి, నవంబర్ 21 (ఈవార్తలు): అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురి వైద్య చికిత్స కోసం రూ.4.20 లక్షల విలువైన ఎల్ఓసీ పత్రాలను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అందజేశారు. శనివారం మెట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. మల్లాపూర్ మండలం రేగుంటకు చెందిన అడ్మాల నర్సారెడ్డికి రూ.1.10 లక్షలు, కోరుట్లకు చెందిన గిన్నెల పద్మకు రూ.2 లక్షలు, ఐలాపూర్‌కు చెందిన బద్దం లింగుకు రూ.1.10 లక్షల చొప్పున ఎల్ఓసీలు మంజూరయ్యాయి. వైద్య చికిత్సకు ఆర్థిక సాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యేకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.



మత్స్యకారుల సేవలు కీలకం: భోగ శ్రావణి

జగిత్యాల, నవంబర్ 21 (ఈవార్తలు): సమాజానికి ఆహార భద్రత కల్పించడంతోపాటు ఆర్థిక వ్యవస్థకు మత్స్యకారులు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని బీజేపీ రాష్ట్ర నాయకురాలు డాక్టర్ భోగ శ్రావణి ప్రవీణ్ అన్నారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మత్స్యకార కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ మత్స్యకారులు జీవనోపాధి కొనసాగిస్తున్నారని, వారి కృషి అభినందనీయమని పేర్కొన్నారు. మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సెల్ కన్వీనర్ బద్దెల గంగరాజాం, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, పట్టణ అధ్యక్షుడు కాశెట్టి తిరుపతి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్, యువమోర్చా పట్టణ అధ్యక్షుడు కొండ్ర రవితేజ, ఇట్యాల రాము, కొండ్ర జగన్, గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.



రైతులకు ఇబ్బందులు వద్దు: అడ్లూరి

బుగ్గారం, నవంబర్ 21 (ఈవార్తలు): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశించారు. శనివారం జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేంద్రాల్లో అవసరమైన గన్నీ సంచులను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత మిల్లర్ల వద్ద ఏవైనా సమస్యలు ఎదురైతే కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి పరిష్కరించాలని స్పష్టం చేశారు. తేమ శాతం నిబంధనలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సూచించారు. రైతులకు సకాలంలో మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



రాష్ట్రస్థాయికి 27 ప్రాజెక్టులు ఎంపిక

జగిత్యాల జిల్లా సైన్స్ ఎగ్జిబిషన్‌లో 460 ఆవిష్కరణల ప్రదర్శన

జగిత్యాల, నవంబర్ 21 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో 27 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (పాత)లో నిర్వహించిన 54వ జిల్లా బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ అవార్డ్స్-మానక్, పీఎం శ్రీ సైన్స్ ఎగ్జిబిషన్ ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఈ ప్రదర్శనలో సుమారు 460 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. వీటిలో ఇన్‌స్పైర్ విభాగం నుంచి 13, బాల వైజ్ఞానిక ప్రదర్శన నుంచి 14 ఆవిష్కరణలు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. ముగింపు కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ప్రసూనాంబ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసూనాంబ మాట్లాడుతూ విద్యార్థులు ప్రకృతిని పరిశీలిస్తూ కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడే ప్రయోగాలు చేపట్టాలని కోరారు. విద్యార్థులు భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదిగి జిల్లాకు పేరు తీసుకురావాలని జిల్లా విద్యాధికారి కె. రాము ఆకాంక్షించారు. జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ విజేతలను అభినందించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్టుక నుంచి మరణం దాకా చట్టమే

చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం: జడ్జి లక్ష్మణాచారి



వేములవాడ అర్బన్, నవంబర్ 21 (ఈవార్తలు): మనిషి పుట్టినప్పటి నుంచి మరణించే వరకు జీవితంలోని ప్రతి అంశం చట్టంతో ముడిపడి ఉంటుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి లక్ష్మణాచారి అన్నారు. ప్రజలు తమ హక్కులు, బాధ్యతలపై కనీస అవగాహన పెంచుకోవాలని సూచించారు. శనివారం వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నాల్సా) మార్గదర్శకత్వంలో, రాజన్న సిరిసిల్ల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన అవగాహన శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దొబ్బల మల్లేశం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ జడ్జిలు లక్ష్మణాచారి, అనిల్‌కుమార్ జాదవ్, డీఎస్పీ శ్రీనివాసులు, వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణాచారి మాట్లాడుతూ దేశంలో వేలాది చట్టాలు ఉన్నాయని, వాటన్నింటినీ వివరించడం సాధ్యం కాకపోయినా ప్రజలకు అవసరమైన చట్టాలపై అవగాహన కల్పించడమే శిబిరం లక్ష్యమని తెలిపారు. కానుగోలు చేసిన వస్తువుల్లో లోపాలు ఉన్నా, నాణ్యత లేని ఆహార పదార్థాల వల్ల నష్టం జరిగినా వినియోగదారులకు చట్టపరమైన పరిష్కార మార్గాలు ఉన్నాయని వివరించారు. నకిలీ వస్తువులు, కల్తీ ఆహారం, కలుషిత నీటి వల్ల ఇబ్బందులు ఎదురైతే సంబంధిత అధికారులను ఆశ్రయించవచ్చని సూచించారు. ప్రజలు తమ రోజువారీ జీవితంలో ఎదురయ్యే సమస్యలపై చట్టపరమైన హక్కులను తెలుసుకోవాలన్నారు. పర్యావరణ కాలుష్యం, ఆహార భద్రత, వినియోగదారుల రక్షణ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. పిల్లలు పుట్టిన వెంటనే జనన ధ్రువీకరణ పత్రం నమోదు చేయించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఆధార్‌తోపాటు ఇతర అవసరాలకు జనన ధ్రువీకరణ పత్రం ఉపయోగపడుతుందని తెలిపారు. వచ్చే డిసెంబర్ 12న మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు లక్ష్మణాచారి వెల్లడించారు. పరిష్కారానికి అర్హమైన భూ వివాదాలు, ప్రామిసరీ నోట్లకు సంబంధించిన ఆర్థిక వివాదాలు, కుటుంబ తగాదాలు, సివిల్ వివాదాలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఇరుపక్షాల అంగీకారంతో వివాదాలను పరిష్కరించుకోవడం వల్ల సమయం, ఖర్చు ఆదా అవుతాయని వివరించారు. అర్హులైన ప్రజలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దొబ్బల మల్లేశం, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ వీరప్రసాద్, అధికారులు, ఉపాధ్యాయులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో ఆహారంపై తనిఖీలు చేయాలి: బీఎస్పీ



సిరిసిల్ల, నవంబర్ 20 (ఈవార్తలు): ప్రభుత్వ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందేలా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో వేలాది మంది పేద విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. వారికి నాణ్యమైన భోజనం, సురక్షితమైన తాగునీరు అందించడం ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు. కొన్ని హాస్టళ్లలో పురుగులు ఉన్న అన్నం, నాణ్యత లేని కూరగాయలు, అపరిశుభ్రమైన ఆహారం, కలుషితమైన తాగునీరు అందుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులు విద్యార్థుల ఆరోగ్యానికి ప్రమాదకరమని తెలిపారు. జిల్లాలోని అన్ని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని కోరారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నదీ లేనిదీ పరిశీలించాలని సూచించారు. వంటగదులు, భోజనశాలలు, ఆహార నిల్వ గదుల్లో పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులతో ఆహార పదార్థాల నాణ్యతను ఎప్పటికప్పుడు తనిఖీ చేయించాలని డిమాండ్ చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని వార్డెన్లు, కాంట్రాక్టర్లు, ఇతర బాధ్యులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి హాస్టల్‌లో విద్యార్థులతో ఫుడ్ కమిటీ ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలు, ఫిర్యాదులు స్వీకరించాలని సూచించారు. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్య చికిత్స అందించే ఏర్పాట్లు చేయాలని కోరారు. హాస్టళ్లలో ఆహార భద్రతపై నిరంతర పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు మంచికట్ల రమేష్, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి కాదాస్ మహేందర్, సిరిసిల్ల ఇన్‌చార్జి గడ్డం మధుసూదన్, వేములవాడ నియోజకవర్గ అధ్యక్షుడు కట్కూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న పనులు వేగవంతం చేయాలి

ప్రతి పనికి గడువు నిర్ణయించాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్



వేములవాడ, నవంబర్ 20 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని వీటీఏడీఏ వైస్ చైర్‌పర్సన్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ప్రతి పనికి ప్రత్యేకంగా గడువు నిర్ణయించి, ఆ గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆలయ విస్తరణ, నిత్యాన్నదాన సత్రం, బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణం, 80 ఫీట్ల రోడ్డు పనులపై సమీక్ష నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ, దేవాదాయ శాఖ, ఎన్పీడీసీఎల్, వేములవాడ మున్సిపల్ అధికారులను ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజన్న ఆలయ విస్తరణ, బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణ పనుల్లో అవసరమైన మేరకు కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిరోజూ నిర్మాణ పనులను పరిశీలించాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం జరగకుండా సంబంధిత విభాగాల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. రాజన్న ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు చేపట్టిన 80 ఫీట్ల రోడ్డు నిర్మాణంలో మిగిలిన పనులను కూడా ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో దేవాదాయ శాఖ ధార్మిక సలహాదారు గోవింద హరి, రాజరాజేశ్వరస్వామి ఆలయ ఈవో రమాదేవి, ఆర్డీవో కేవీఎన్‌బీ కుమారి, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లానాయక్, వేములవాడ మున్సిపల్ కమిషనర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో భక్తిశ్రద్ధలతో నగర కీర్తన్

గురు నానక్ 557వ జయంతి వేడుకలు



హైదరాబాద్, నవంబర్ 21 (ఈవార్తలు): సిక్కుల తొలి గురువు గురు నానక్ దేవ్ 557వ జయంతి వేడుకల్లో భాగంగా శనివారం హైదరాబాద్‌లో నగర కీర్తన్ శోభాయాత్ర భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సికింద్రాబాద్ గురుద్వారా సాహిబ్ నిర్వహణ కమిటీ చైర్మన్ సర్దార్ కుల్దీప్‌సింగ్ సలూజా ఆధ్వర్యంలో పంచ ప్యారేల మార్గదర్శకత్వంలో, పవిత్ర గురు గ్రంథ్ సాహిబ్ సాన్నిధ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అఫ్జల్‌గంజ్‌లోని అశోక్‌బజార్ గురు సింగ్ సభ నుంచి ప్రారంభమైన శోభాయాత్ర సిద్ధి అంబర్‌బజార్, ఎంజే మార్కెట్, జాంబాగ్, పుత్లిబౌలి, గౌలిగూడలోని సెంట్రల్ గురుద్వారా సాహిబ్ మీదుగా సాగి తిరిగి ప్రారంభ స్థలానికి చేరుకుంది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది సిక్కు భక్తులు పాల్గొన్నారు. శోభాయాత్రలో సిక్కుల సంప్రదాయ యుద్ధ కళల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నాందేడ్‌కు చెందిన జాతా తేరా జాతా, మహిళా సత్సంగ్ మరాఠా జాతా, అమృత్‌సర్‌కు చెందిన జై తేగన్ గట్కా అఖారా, దమ్మేష్ కల్గిధర్ జాతా బృందాలు గట్కా ప్రదర్శనలు నిర్వహించాయి. సిక్కు మహిళలు గురుబాణి ఆధారంగా సత్సంగ్‌లు నిర్వహించారు. భక్తులు శబ్ద కీర్తనలు ఆలపించారు. శోభాయాత్ర సాగిన మార్గంలో



207 మందికి ఇందిరమ్మ ఇళ్లు

మంజూరు పత్రాలు పంపిణీ చేసిన జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల, నవంబర్ 21 (ఈవార్తలు): కోరుట్ల పట్టణం, మండల పరిధిలోని 207 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను శనివారం పంపిణీ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. వీరిలో కోరుట్ల పట్టణానికి చెందిన 80 మంది, మండల పరిధిలోని 127 మంది ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అదువాల జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కమిషనర్, ఎంపీడీవో, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



అంజన్న నిజరూప దర్శనానికి భక్తజనం

మల్యాల, నవంబర్ 21 (ఈవార్తలు): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో శనివారం స్వామివారి నిజరూప దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. 60 ఏళ్ల తర్వాత నిజరూప దర్శనం కల్పించడంతో తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కొండగట్టుకు చేరుకున్నారు. ఉదయం నుంచే ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. అంజన్న దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. హనుమాన్ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులు స్వామివారిని నిజరూపంలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం సెలవు దినం కావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు, పోలీసు సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. దశాబ్దాల తర్వాత స్వామివారి నిజరూప దర్శనం లభించడంపై భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.



వాలీబాల్ జట్టు కెప్టెన్‌గా కొడిమ్యాల విద్యార్థి

అండర్-17 రాష్ట్రస్థాయి పోటీలకు శివసాత్విక్, లోకేష్ ఎంపిక

ఈవార్తలు, క్రీడావాణి: ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్-17 వాలీబాల్ జట్టు కెప్టెన్‌గా కొడిమ్యాల మోడల్ స్కూల్ విద్యార్థి చింతలతాడు శివసాత్విక్ ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ బి. లావణ్య వెల్లడించారు. నవంబర్ 23, 24, 25 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్లలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్-17 వాలీబాల్ పోటీల్లో శివసాత్విక్ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. ఇదే పాఠశాలకు చెందిన చెట్టుపల్లి లోకేష్ కూడా పోటీల్లో పాల్గొననున్నాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడంపై పాఠశాల వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

నేటి నుంచి ఇంటింటికీ సభ్యత్వ నమోదు: గజం రాజు

వేములవాడ, నవంబర్ 21 (ఈవార్తలు): హిత చింతక్ అభియాన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో హిందువులు భాగస్వాములు కావాలని నాయకుడు గజం రాజు పిలుపునిచ్చారు. శనివారం వేములవాడలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 22 నుంచి వేములవాడ పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ సభ్యత్వ నమోదు చేపట్టనున్నట్లు తెలిపారు. హిందూ సమాజంలో ధార్మిక, సామాజిక చైతన్యం పెంపొందించడం, సేవా కార్యక్రమాలను బలోపేతం చేయడం అభియాన్ లక్ష్యమని పేర్కొన్నారు. యువత, మహిళలు, మేధావులు, వ్యాపారులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకోవాలని కోరారు. సభ్యత్వ నమోదు కోసం వచ్చే కార్యకర్తలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో గడవ కిషోర్‌రావు, నాగుల రాము, గన్నమనేని ప్రదీప్‌రావు, పల్లె శ్యాంసుందర్‌రెడ్డి, గుండోజు గోపాల్, సనుగుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇరాన్‌తో ఖతార్ రాయబారం

టెహ్రాన్, నవంబర్ 21 : అమెరికాతో యుద్ధాన్ని ముగించేందుకు దౌత్య చర్చలకు మరో అవకాశం ఉందా అన్న అంశంపై ఖతార్ ప్రతినిధులు శుక్రవారం రాత్రి టెహ్రాన్‌లో సమావేశమైనట్లు ఇరాన్ శనివారం వెల్లడించింది. మధ్యవర్తులతో నేరుగానూ, ఆన్‌లైన్‌లోనూ సంప్రదింపులు కొనసాగుతున్నాయని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కజెమ్ గరీబాబాదీ తెలిపారు. ఆయన వ్యాఖ్యలను ఇరాన్‌కు చెందిన తస్నీమ్ వార్తా సంస్థ ఉటంకించింది. మరోవైపు దౌత్య ప్రయత్నాల ద్వారానే యుద్ధానికి ముగింపు పలకగలమన్న ఆశ ఇంకా ఉందని విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చీ ప్రభుత్వ పత్రిక 'ఇరాన్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. అమెరికా, ఇజ్రాయెల్ ఫిబ్రవరి 28న ఇరాన్‌పై దాడులు చేయడంతో మొదలైన యుద్ధం గల్ఫ్‌లోని ఇతర దేశాలకూ విస్తరించింది. ఇరాన్ ప్రతిగా ఇజ్రాయెల్‌పై, అమెరికా సైనిక స్థావరాలున్న గల్ఫ్ దేశాలపై దాడులు జరిపింది. సముద్ర రవాణాకు అంతరాయం ఏర్పడి అంతర్జాతీయ ఇంధన ధరలపైనా ప్రభావం పడింది.





ఆఫ్రికాకు ఎగుమతుల్లో 44 శాతం వృద్ధి

న్యూఢిల్లీ, నవంబర్ 21 : భారత సరకులకు ఆఫ్రికాలో గిరాకీ పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఆ ఖండానికి భారత్ నుంచి వెళ్లిన సరకుల విలువ 31.42 బిలియన్ డాలర్లకు చేరింది. గత ఏడాది ఇదే ఆరు నెలల్లో అది 21.87 బిలియన్ డాలర్లు. ఏడాది వ్యవధిలో 9.55 బిలియన్ డాలర్ల మేర అదనంగా ఎగుమతులు జరిగాయి. కేంద్రం శనివారం విడుదల చేసిన ప్రాంతాలవారీ లెక్కల ప్రకారం పెరుగుదల 44 శాతం. భారత సరకులను కొనుగోలు చేసే ప్రధాన ప్రాంతాల్లో వృద్ధి వేగం ఆఫ్రికాలోనే ఎక్కువగా నమోదైంది. మొత్తం వ్యాపార విలువను చూస్తే ఆసియా మార్కెట్ చాలా పెద్దది. ఆసియా దేశాలకు భారత ఎగుమతులు 85.84 బిలియన్ డాలర్ల నుంచి 103.84 బిలియన్ డాలర్లకు పెరిగాయి. వృద్ధి రేటు 21 శాతమే అయినా, అదనంగా సమకూరిన ఎగుమతుల విలువ 18 బిలియన్ డాలర్లు. అంటే ఆఫ్రికాలో వృద్ధి రేటు ఆసియా కంటే రెట్టింపునకు పైగా ఉండగా, డాలర్లలో పెరిగిన విలువ మాత్రం ఆసియాలో దాదాపు రెట్టింపు. గత ఏడాది ఆయా ప్రాంతాలతో జరిగిన వ్యాపారం పరిమాణంలో ఉన్న తేడాయే ఇందుకు కారణం. ఈ రెండు మార్కెట్లకే కలిపి ఆరు నెలల్లో 135.26 బిలియన్ డాలర్ల విలువైన భారత సరకులు వెళ్లాయి. ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాల మార్కెట్లకు ఎగుమతుల్లో 13 శాతం, ఐరోపాకు 8 శాతం వృద్ధి నమోదైంది. సీఐఎస్, బాల్టిక్ దేశాలను కలిపి చూసిన విభాగంలో పెరుగుదల 7 శాతంగా ఉంది. ఇంజినీరింగ్ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, పెట్రోలియం ఉత్పత్తులు ప్రధాన ఎగుమతి వర్గాలుగా కొనసాగాయని కేంద్రం తెలిపింది.



వంద రోజులుగా 'పార్లమెంటు' వాయిదా

న్యూఢిల్లీ, నవంబర్ 21 : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను నిరవధికంగా వాయిదా వేసి శనివారానికి వంద రోజులు పూర్తయ్యాయి. ఆగస్టు 13న లోక్‌సభ, రాజ్యసభ వాయిదా పడ్డాయి. అయితే నవంబర్ 21 ఉదయం వరకూ సమావేశాల విడతను అధికారికంగా ముగించే ప్రకటన వెలువడలేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 2008లో ఇదే తరహాలో 87 రోజుల విరామం నమోదైంది. ఈసారి ఆ వ్యవధిని దాటి మరో పదమూడు రోజులు గడిచాయి. మహిళా రిజర్వేషన్ అమలుకు సంబంధించి ప్రత్యేకంగా సభను సమావేశపరుస్తారా అన్న చర్చకు ఈ సుదీర్ఘ విరామం రాజకీయ ప్రాధాన్యం తెచ్చింది. సభ నిరవధికంగా వాయిదా పడినప్పుడు తదుపరి సమావేశ తేదీని ఆ రోజున ప్రకటించరు. 'ప్రొరోగేషన్' అంటే అప్పటివరకు సాగిన సమావేశాల విడతను అధికారికంగా ముగించడం. మొదటిది జరిగిన రోజు నుంచే రెండోది కూడా అమలవుతుందనుకుంటే వంద రోజుల లెక్క అర్థం కాదు. సభ్యులు రోజూ సమావేశమవుతున్నారని కూడా దీని అర్థం కాదు. ఆగస్టులో సభా కార్యకలాపాలు ఆగినా, ఆ సమావేశాల విడతకు అధికారిక ముగింపు రాలేదు.

'నీట్' కేసులో 25 నుంచి రోజువారీ విచారణ

న్యూఢిల్లీ, నవంబర్ 21 : వైద్య విద్య ప్రవేశాలకు నిర్వహించిన నీట్-యూజీ పరీక్ష ప్రశ్నపత్రం బయటకు వచ్చిందన్న కేసులో విచారణ కీలక దశకు చేరింది. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు శనివారం 14 మంది నిందితులపై అభియోగాలను నమోదు చేసింది. జ్యుడీషియల్ కస్టడీ నుంచి నిందితులను కోర్టుకు తీసుకురాగా, తమపై మోపిన అభియోగాలను అందరూ తిరస్కరించారు. దీంతో నవంబర్ 25 నుంచి ప్రాసిక్యూషన్ సాక్ష్యాల నమోదు ప్రారంభం కానుంది. విచారణను రోజువారీగా చేపట్టాలని ప్రత్యేక న్యాయమూర్తి అజయ్ గుప్తా ఇప్పటికే ఆదేశించారు. ఈ ఏడాది మేలో సీబీఐ కేసు నమోదు చేసింది. జులైలో 13 మందిపై తొలి చార్జిషీట్ దాఖలు చేసింది. అనంతరం సెప్టెంబర్ 2న శేషరావు బజరంగ్ సూర్యవంశీపై అనుబంధ చార్జిషీట్ వేసింది. దీంతో విచారణ ఎదుర్కొంటున్న వారి సంఖ్య 14కు చేరింది. వీరిలో ప్రశ్నపత్రానికి సంబంధించిన అంశాలపై పనిచేసిన ముగ్గురు సబ్జెక్ట్ నిపుణులు కూడా ఉన్నారు. సీబీఐ తన కేసుకు మద్దతుగా 360 మంది సాక్షులు, 422 పత్రాలు, 43 వస్తు ఆధారాలను పేర్కొంది. ఈ ఆధారాల్లో దేని ద్వారా ఎవరి పాత్ర నిరూపణ అవుతుందన్నది కోర్టులో జరిగే విచారణలో తేలాల్సి ఉంది.

కొడిమ్యాలలో రెండో రోజు 560 కుటుంబాల నమోదు

కొడిమ్యాల, నవంబర్ 21 (ఈవార్తలు): ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద కొడిమ్యాల మండలంలో రెండో రోజు 560 కుటుంబాల నమోదు ప్రక్రియ పూర్తయింది. రెండు రోజుల్లో కలిపి మొత్తం 1,033 కుటుంబాల నమోదు పూర్తయినట్లు ఎంపీడీవో కార్యాలయం వెల్లడించింది. మండలంలోని రామకిష్టాపూర్, శనివారంపేట, కొండాపూర్, నామిలికొండ, తిరుమలాపూర్, తిప్పాయపల్లి గ్రామాల్లో మొదటి విడత నమోదు కార్యక్రమం కొనసాగుతోంది. శనివారం ఆయా గ్రామాల్లో 560 కుటుంబాల వివరాలను నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

కెనడాలో భారత సంతతి జంట దారుణ హత్య

ఒట్టావా, నవంబర్ 21: కెనడాలో భారత సంతతికి చెందిన యువతీయువకులు దారుణ హత్యకు గురయ్యారు. బ్రిటిష్ కొలంబియా ప్రావిన్స్‌లోని సర్రే నగరంలో వాల్‌మార్ట్ స్టోర్ పార్కింగ్ ప్రదేశంలో గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడి ముందస్తు ప్రణాళిక ప్రకారం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. వ్యవస్థీకృత నేర ముఠాలకు ఈ ఘటనతో సంబంధం ఉండే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. మృతులను దెల్టా ప్రాంతానికి చెందిన గగన్‌ప్రీత్ రెహల్ (23), సుఖ్‌జీత్ కౌర్ (24)గా గుర్తించారు. ఈ జంట హత్యలపై ఇంటిగ్రేటెడ్ హోమిసైడ్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (ఐహెచ్ఐటీ) దర్యాప్తు చేపట్టింది. గగన్‌ప్రీత్‌పై గతంలో ఆయుధాలకు సంబంధించిన కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. సుఖ్‌జీత్ కౌర్‌కు కెనడాలో పరిచయాలు పరిమితంగా ఉన్నట్లు తెలిపారు. వీరిద్దరూ ప్రేమ జంటగా సమాచారం. నవంబర్ 15 రాత్రి 10.38 గంటల సమయంలో సర్రేలోని



న్యూటన్ ప్రాంతంలో 88 అవెన్యూ, 124 స్ట్రీట్ సమీపంలోని వాల్‌మార్ట్ పార్కింగ్‌లో కాల్పులు జరిగాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అత్యవసర వైద్య సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనా స్థలంలో బాధితుల్లో ఒకరికి చెందిన ఎరుపు రంగు ముస్టాంగ్ కారును పోలీసులు గుర్తించారు. కాల్పులు జరిగిన కొద్దిసేపటికే రాత్రి 10.51 గంటలకు ఫ్రిన్సెస్ డ్రైవ్‌లోని 9700 బ్లాక్ ప్రాంతంలో ఓ సెడాన్ కారు మంటల్లో కాలిపోతున్నట్లు సమాచారం అందింది. ఆ కారు నిందితులు ఉపయోగించినదై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దాడి అనంతరం ఆధారాలు దొరకకుండా వాహనాలను తగలబెట్టడం గ్యాంగ్ నేరాల్లో కనిపించే పద్ధతి అని అధికారులు పేర్కొన్నారు. అయితే ఈ హత్యలకు కారణమైన వ్యక్తులు, నిర్దిష్ట నేర ముఠాల వివరాలు ఇంకా నిర్ధారణ కాలేదని స్పష్టం చేశారు. ఈ ఘటనను లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడిగా భావిస్తున్నట్లు ఐహెచ్ఐటీ ప్రతినిధి సార్జెంట్ ఖ్రెడా ఫాంగ్ తెలిపారు. ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదన్నారు. నవంబర్ 15 రాత్రి 10 నుంచి 11 గంటల మధ్య ఘటన జరిగిన ప్రాంతంలో అనుమానాస్పద కదలికలను గమనించినవారు, డ్యాష్‌క్యామ్ వీడియోలు ఉన్నవారు దర్యాప్తు అధికారులను సంప్రదించాలని కోరారు.

టీవీఎస్ స్టార్ సిటీ ప్లస్‌కు వీడ్కోలు?

అధికారిక వెబ్‌సైట్ నుంచి బైక్ తొలగింపు

న్యూఢిల్లీ, నవంబర్ 21: ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ టీవీఎస్ మోటార్ తన అధికారిక భారత వెబ్‌సైట్ నుంచి స్టార్ సిటీ ప్లస్ బైక్‌ను తొలగించినట్లు కథనాలు వెల్లడించాయి. దీంతో దాదాపు 12 ఏళ్లుగా మార్కెట్‌లో కొనసాగుతున్న ఈ 110 సీసీ కమ్యూటర్ బైక్ ఉత్పత్తిని కంపెనీ నిలిపివేసి ఉండవచ్చనే ప్రచారం మొదలైంది. అయితే దీనిపై టీవీఎస్ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. 2014లో భారత మార్కెట్‌లోకి వచ్చిన స్టార్ సిటీ ప్లస్ తక్కువ ధరలో రోజువారీ ప్రయాణాలకు అనువైన బైక్‌గా గుర్తింపు పొందింది. మైలేజీ, నిర్వహణ ఖర్చుల విషయంలో బడ్జెట్ వినియోగదారులను ఆకట్టుకుంది. అయితే కాలక్రమంలో మార్కెట్‌లో పోటీ పెరగడం, కొత్త మోడళ్లు అందుబాటులోకి రావడంతో ఈ బైక్ అమ్మకాలు తగ్గినట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. 2021 మార్చిలో రోటో పెటల్ ఫ్రంట్ డిస్క్ బ్రేక్‌ను జోడించిన తర్వాత ఈ మోడల్‌కు పెద్దగా సాంకేతిక అప్‌డేట్లు రాలేదు. ఉద్గార నిబంధనలకు అనుగుణంగా మార్పులు చేసినప్పటికీ కొత్త ఫీచర్ల విషయంలో వెనుకబడినట్లు మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. 2026 తొలి నాలుగు నెలల్లో స్టార్ సిటీ ప్లస్ కేవలం 49 యూనిట్లు మాత్రమే అమ్ముడైనట్లు నివేదికలు పేర్కొన్నాయి. మే నుంచి సెప్టెంబర్ వరకు ఒక్క యూనిట్ కూడా విక్రయించలేదని తెలిపాయి. ఈ బైక్‌లో 109.7 సీసీ సింగిల్ సిలిండర్ ఎయిర్ కూల్డ్



ఇంజిన్ ఉండేది. ఇది 8.2 హెచ్‌పీ పవర్, 8.7 ఎన్ఎమ్ టార్క్‌ను అందించేది. ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్, సెమీ డిజిటల్ కన్సోల్, యూఎస్‌బీ ఛార్జింగ్ పోర్ట్, ట్యూబ్‌లెస్ టైర్ల వంటి ఫీచర్లు అందుబాటులో ఉండేవి. స్టార్ సిటీ ప్లస్ ఉత్పత్తి నిలిపివేత ఖరారైతే టీవీఎస్ బడ్జెట్ మోటార్‌సైకిల్ విభాగంలో రేడియాన్, స్పోర్ట్ మోడళ్లకు మరింత ప్రాధాన్యం పెరగనుంది.

అనిరుధ్-కావ్య రిసెప్షన్‌లో ప్రముఖుల సందడి!





చెన్నైలో వైభవంగా వేడుక

సినీ, రాజకీయ, క్రికెట్ ప్రముఖుల హాజరు అంటూ కథనాలు

ఈవార్తలు, వినోదవాణి: ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈఓ కావ్య మారన్ వివాహ రిసెప్షన్ చెన్నైలో శనివారం రాత్రి ఘనంగా జరిగినట్లు కథనాలు వెల్లడించాయి. సినీ, రాజకీయ, వ్యాపార, క్రీడా రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొన్నట్లు పేర్కొన్నాయి. నవంబర్ 11న గ్రీన్‌లో కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో వీరి వివాహం జరిగినట్లు ప్రచారంలో ఉంది. పెళ్లి జరిగిన పది రోజుల తర్వాత బంధుమిత్రులు, శ్రేయోభిలాషుల కోసం చెన్నైలో భారీ రిసెప్షన్ ఏర్పాటు చేసినట్లు కథనాలు తెలిపాయి. ఈ వేడుకకు తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, డీఎంకే అధ్యక్షుడు ఎం.కె. స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏపీ మంత్రి నారా లోకేశ్ హాజరైనట్లు కథనాల్లో పేర్కొన్నారు. డీఎంకే నేతలు దురైమురుగన్, కనిమొళి, ఎ.రాజాతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు పాల్గొన్నట్లు తెలిపారు. సినీ రంగం నుంచి రజనీకాంత్, కమల్ హాసన్, సౌందర్య రజనీకాంత్, ప్రభు, రాధికా శరత్‌కుమార్, నిర్మాత కలైపులి ఎస్.థాను, దర్శకుడు ధరణి తదితరులు హాజరైనట్లు సమాచారం. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీతో కావ్య మారన్‌కు ఉన్న అనుబంధం నేపథ్యంలో క్రికెట్ ప్రముఖులు కూడా పాల్గొన్నట్లు కథనాలు పేర్కొన్నాయి. భారత పేసర్ భువనేశ్వర్ కుమార్, న్యూజిలాండ్ బ్యాటర్ కేన్ విలియమ్సన్, శ్రీలంక మాజీ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ హాజరైనట్లు తెలిపాయి. అయితే వివాహం, రిసెప్షన్, అతిథుల హాజరు, పేర్కొన్న రాజకీయ పదవులకు సంబంధించి అధికారిక ధ్రువీకరణ అవసరం. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ఫొటోలు, వీడియోల ఆధారంగా మాత్రమే ఈ వివరాలను నిర్ధారించరాదు.



ఆపరేషన్ సిందూర్ వేళ

పాక్‌కు చైనా సాయం

అమెరికా కాంగ్రెస్ కమిషన్ నివేదికలో కీలక అంశాలు

న్యూఢిల్లీ, నవంబర్ 21 : ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు చైనా సైనిక, సాంకేతిక సహకారం అందించిందని అమెరికాచైనా ఎకనామిక్ అండ్ సెక్యూరిటీ రివ్యూ కమిషన్ నివేదికలో పేర్కొన్నట్లు వార్తలు వెలువడ్డాయి. ఆసియాలో భారత్ ఎదుగుదలను అడ్డుకునేందుకు చైనా వివిధ వ్యూహాలను అనుసరిస్తోందని నివేదిక విశ్లేషించినట్లు సమాచారం. సరిహద్దుల్లో సైనిక ఒత్తిడి పెంచడం, పారిశ్రామిక సరఫరాలపై ఆంక్షలు విధించడం వంటి చర్యల ద్వారా భారత్‌ను కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తోందని పేర్కొంది. 2025లో పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన నాలుగు రోజుల సైనిక ఘర్షణల సమయంలో చైనా నేరుగా యుద్ధంలో పాల్గొనకుండానే పాకిస్థాన్‌కు సహకరించిందని నివేదికలో పేర్కొన్నట్లు కథనం తెలిపింది. పాక్ వాయుసేన ఉపయోగించిన జే10సీఈ యుద్ధ విమానాలకు చైనా ఇంజినీర్లు సాంకేతిక సహాయం అందించినట్లు ప్రస్తావించింది. భారత సైనిక మోహరింపులకు సంబంధించిన సమాచారాన్ని కూడా పాకిస్థాన్‌కు చేరవేసిందని పేర్కొంది. భవిష్యత్తులో భారత్ ఒకేసారి రెండు వైపుల నుంచి సైనిక సవాళ్లను ఎదుర్కొనే ప్రమాదం ఉందని కమిషన్ హెచ్చరించినట్లు కథనం వివరించింది. భారత ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంపై ప్రభావం చూపేందుకు ముడిసరకుల సరఫరాను నియంత్రించడం, ఇంజినీర్లను వెనక్కి పిలిపించడం వంటి చర్యలను చైనా చేపడుతోందని నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. ఫార్మా, క్లీన్ ఎనర్జీ రంగాల్లోనూ చైనా అనుసరిస్తున్న ధరల వ్యూహాలు, బ్యాటరీ టెక్నాలజీకి సంబంధించిన ఆంక్షలు భారత్‌కు సవాళ్లు సృష్టిస్తున్నాయని విశ్లేషించింది. ఈ పరిస్థితుల్లో భారత్‌తో నిఘా సమాచార మార్పిడి, సముద్ర భద్రత, రక్షణ, తయారీ రంగాల్లో అమెరికా సహకారాన్ని విస్తరించాలని కమిషన్ సిఫార్సు చేసినట్లు కథనం తెలిపింది.



ఏఐ భయాలతో అమెరికా మార్కెట్ల పతనం!

టెక్ షేర్లలో భారీ అమ్మకాలు.. భారత మార్కెట్ల స్థిరత్వంపై చర్చ

న్యూయార్క్, నవంబర్ 21: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో భారీ పెట్టుబడులకు తగిన రాబడులు వస్తాయా అనే అనుమానాలు అమెరికా స్టాక్ మార్కెట్లను కుదిపేస్తున్నట్లు మార్కెట్ కథనాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా టెక్నాలజీ, సెమీకండక్టర్ కంపెనీల షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో ప్రధాన సూచీలు భారీ నష్టాలను నమోదు చేసినట్లు తెలిపాయి. ఏఐ రంగంపై మదుపర్లలో పెరుగుతున్న ఆందోళనలు అంతర్జాతీయ మార్కెట్లపైనా ప్రభావం చూపుతున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. శుక్రవారం ట్రేడింగ్‌లో ఎస్ అండ్ పీ-500 సూచీ 3.7 శాతం పతనమై వరుసగా ఏడో రోజు నష్టాలను నమోదు చేసినట్లు కథనం పేర్కొంది. నాస్‌డాక్-100 సూచీ 5.6 శాతం పడిపోయినట్లు తెలిపింది. మార్చి 2020లో కరోనా మహమ్మారి సమయంలో నమోదైన భారీ పతనం తర్వాత మళ్లీ ఆ స్థాయిలో నష్టాలు ఎదురయ్యాయని వివరించింది. సెమీకండక్టర్, ఏఐ రంగాల షేర్లలో అమ్మకాలు ఎక్కువగా జరిగినట్లు సమాచారం. ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఎన్విడియా అకౌంటింగ్ వ్యవహారాలపై అమెరికా నియంత్రణ సంస్థలు దర్యాప్తు చేస్తున్నాయనే వార్తల నేపథ్యంలో ఆ కంపెనీ షేరు 14 శాతం పడిపోయినట్లు కథనం పేర్కొంది. కొత్తగా లిస్టయినట్లు పేర్కొన్న ఆంథ్రోపిక్ షేరు కూడా ఎనిమిది శాతం క్షీణించినట్లు తెలిపింది. మార్కెట్లలో పెరిగిన అనిశ్చితితో మదుపర్లు ప్రభుత్వ బాండ్లు, కరెన్సీల వంటి తక్కువ రిస్క్ ఉన్న పెట్టుబడుల వైపు మొగ్గుచూపుతున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. అమ్మకాల ఒత్తిడి క్రిప్టోకరెన్సీలు, లోహాలు, వర్ధమాన మార్కెట్లకు కూడా విస్తరించినట్లు కథనం వెల్లడించింది. బిట్‌కాయిన్ 5.1 శాతం తగ్గి 58,333 డాలర్లకు, ఈథర్ ఎనిమిది శాతం పతనమై 1,601 డాలర్లకు చేరినట్లు పేర్కొంది. డౌ జోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ 1.9 శాతం, ఎంఎస్‌సీఐ వరల్డ్ ఇండెక్స్ 3.4 శాతం చొప్పున నష్టపోయినట్లు తెలిపింది.

భారత్‌కు పెట్టుబడుల అవకాశం?

అమెరికా మార్కెట్లలో ఏఐ రంగానికి సంబంధించిన అనిశ్చితి పెరుగుతున్న నేపథ్యంలో భారత మార్కెట్ల స్థిరత్వంపై చర్చ మొదలైంది. అమెరికాలో ఏఐ పెట్టుబడులపై ఆందోళన చెందుతున్న అంతర్జాతీయ మదుపర్లకు భారత్ ప్రత్యామ్నాయ పెట్టుబడి కేంద్రంగా మారే అవకాశం ఉందని కొన్ని విశ్లేషణలు పేర్కొంటున్నాయి. ఎస్‌బీఐ ఫండ్స్ నివేదికను ఉటంకిస్తూ అమెరికా జీడీపీలో ఏఐ మూలధన వ్యయం 2025 నుంచి 2032 మధ్య సగటున 3.6 శాతంగా ఉండవచ్చని కథనం తెలిపింది. 2000 నాటి డాట్‌కామ్ బుడగ సమయంలో నమోదైన 1.1 శాతం వ్యయంతో పోలిస్తే ఇది చాలా ఎక్కువని పేర్కొంది. అయితే అమెరికా మార్కెట్లలో నష్టాలు వచ్చినంత మాత్రాన భారత మార్కెట్లు పూర్తిగా సురక్షితమని చెప్పలేమని గుర్తించాలి. అంతర్జాతీయ పెట్టుబడుల ప్రవాహం, వడ్డీ రేట్లు, డాలర్ విలువ, కంపెనీల లాభాలు వంటి అంశాలు భారత మార్కెట్లనూ ప్రభావితం చేస్తాయి.

మత్తుకు దూరంగా ఉండాలి



జగిత్యాల, నవంబర్ 21 (ఈవార్తలు): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని డీ-అడిక్షన్ కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. అక్కడ అందిస్తున్న వైద్య సేవలు, చికిత్సా విధానాలు, కౌన్సెలింగ్ వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, మద్యం, ఇతర మత్తు పదార్థాలకు అలవాటుపడటం వల్ల ఆరోగ్యంతోపాటు భవిష్యత్తు కూడా దెబ్బతింటుందన్నారు. వ్యసనాలతో బాధపడుతున్న వారికి వైద్య చికిత్స, కౌన్సెలింగ్ అందించి తిరిగి సాధారణ జీవితం గడిపేలా సహకరించాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ విక్రయాలు, రవాణాపై పోలీసుల నిఘా కొనసాగుతోందని తెలిపారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సైలు కిరణ్‌కుమార్, సుప్రియ, వైద్యాధికారులు పాల్గొన్నారు.





‘ఇడుపు కాయితం’ నుంచిపెళ్లి పాట

పల్లెటూరి సంప్రదాయాలతో ‘గోగులు గోగులు’

డిసెంబర్ 11న సినిమా విడుదల

ఈవార్తలు, వినోదవాణి: నటుడు ప్రియదర్శి హీరోగా తెరకెక్కుతున్న ‘ఇడుపు కాయితం’ సినిమా నుంచి ‘గోగులు గోగులు’ లిరికల్ సాంగ్ విడుదలైంది. తెలంగాణ పల్లెటూరి పెళ్లి సంప్రదాయాలను ప్రతిబింబించేలా రూపొందించిన ఈ పాటలో గ్రామీణ వాతావరణాన్ని ఆకట్టుకునేలా చూపించారు. నలుగు వేడుకలు, జీలకర్ర బెల్లం, తాళి కట్టడం, మెట్టెలు తొడగడం వంటి పెళ్లి ఘట్టాలను పాటలో పొందుపరిచారు. ప్రియదర్శి, నాగదుర్గ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి వంశీ రెడ్డి దొండపాటి రచన, దర్శకత్వం వహిస్తున్నారు. సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్లపై బన్నీ వాస్, తబిత సుకుమార్ నిర్మిస్తున్నారు. సాధారణంగా పెళ్లి పాటల్లో హుషారైన బీట్‌లకు ప్రాధాన్యం ఇస్తుంటారు. అయితే ‘గోగులు గోగులు’ పాటను ఆహ్లాదకరమైన జానపద బాణీలో రూపొందించారు. కొంగరి కృష్ణ సాహిత్యం అందించగా, సురేష్ బొబ్బిలి సంగీతం సమకూర్చారు. అభిక్య తనికెళ్ల, తరుణి, రచిత రాయప్రోలు, జయశ్రీ పల్లెం, స్నిగ్ధ శర్మ కలిసి ఆలపించారు. ఎం.ఎన్.బాల్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందించారు. ఈ చిత్రంలో రచ్చ రవి, బిత్తిరి సత్తి, అభయ్ బేతిగంటి, మైమ్ మధు, తీన్మార్ సావిత్రి, జోర్దార్ సుజాత, చంద్రవ్వ, మౌనికా రెడ్డి తదితరులు నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార పాటలకు మంచి స్పందన వస్తోందని చిత్ర బృందం తెలిపింది. డిసెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుంది.



పవన్ ‘ఎం పవర్ స్టార్’: ఉపాసన

ఈవార్తలు, వినోదవాణి: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఆయన కుటుంబ సభ్యురాలు ఉపాసన కామినేని కొణిదెల ‘ఎం పవర్ స్టార్’గా అభివర్ణించారు. పిఠాపురం నియోజకవర్గంలో జరిగిన ఓ కార్యక్రమంలో పవన్ కల్యాణ్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆమె ప్రశంసించారు. కాకినాడ జిల్లా పిఠాపురం అగ్రహారంలో అపోలో ఫౌండేషన్ టోటల్ హెల్త్ ఆధ్వర్యంలో నిర్మించిన ‘అపోలో ఆరంభ్’ మోడల్ అంగన్వాడీ కేంద్రాన్ని ఉపాసన, కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ ప్రారంభించారు. సుమారు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ కేంద్రంలో డిజిటల్ పాఠాల కోసం ఎల్ఈడీ స్క్రీన్లు, చిన్నారులకు టేబుళ్లు, కుర్చీలు, భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాసన మాట్లాడుతూ.. “మీ అందరికీ పవన్ కల్యాణ్ పవర్ స్టార్ కావచ్చు. కానీ నాకు మాత్రం ఆయన ఎం పవర్ స్టార్. పిఠాపురంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను దగ్గరగా చూశాను” అని అన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం నైపుణ్యాభివృద్ధి శిక్షణ, సులభంగా రుణాలు అందించే అంశాలపై పవన్ కల్యాణ్ దృష్టి పెడుతున్నారని ఆమె పేర్కొన్నారు. విద్యాసంస్థల ఏర్పాటు ద్వారా విద్యార్థులకు అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ‘అపోలో ఆరంభ్’ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 109 మోడల్ అంగన్వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఉపాసన వెల్లడించారు. మహిళలు, చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారం, ప్రాథమిక విద్యా ప్రమాణాలను మెరుగుపరచడమే ఈ ప్రాజెక్టు ఉద్దేశమన్నారు. తొలి కేంద్రాన్ని పిఠాపురంలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.

శ్రియ ఫిట్‌నెస్ అదుర్స్



ఈవార్తలు, వినోదవాణి: నటి శ్రియ శరణ్ మరోసారి తన ఫొటోషూట్‌తో సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. తాజాగా ఆమె షేర్ చేసిన ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. స్టైలిష్ లుక్స్‌తో కనిపించిన శ్రియ ఫొటోలను నెటిజన్లు విస్తృతంగా షేర్ చేస్తున్నారు. సినిమాలతో పాటు ఫిట్‌నెస్‌కు శ్రియ ఎంతో ప్రాధాన్యం ఇస్తుంటారు. డ్యాన్స్, యోగా, వ్యాయామాలను తన రోజువారీ జీవితంలో భాగంగా చేసుకున్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు క్రమశిక్షణ అవసరమని ఆమె అనుసరించే జీవనశైలి ద్వారా తెలియజేస్తున్నారు. వివాహం తర్వాత కూడా నటనను కొనసాగిస్తున్న శ్రియ కుటుంబ బాధ్యతలు, సినీ కెరీర్‌ను సమన్వయం చేసుకుంటున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఫొటోషూట్లు, వ్యక్తిగత విశేషాలను అభిమానులతో పంచుకుంటున్నారు. ఇటీవల విడుదలైన హిందీ చిత్రం ‘దృశ్యం 3’లో శ్రియ నటించినట్లు కథనాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం ఆమె ‘నాన్ వయలెన్స్’ అనే ప్రాజెక్టులో నటిస్తున్నారు. విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించేందుకు ప్రయత్నిస్తున్నారు.



ఈవార్తలు, వినోదవాణి: బాలీవుడ్ నటి కృతి సనన్ వ్యక్తిగత జీవితంపై మరోసారి సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. లండన్‌కు చెందిన వ్యాపారవేత్త కబీర్ బహియాతో ఆమె ప్రేమలో ఉన్నారంటూ కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. తాజాగా కబీర్ పుట్టినరోజు సందర్భంగా కృతి షేర్ చేసిన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ఈ ప్రచారానికి మరింత ఊతమిచ్చింది. సముద్ర తీరంలో సూర్యాస్తమయం వేళ కబీర్ దిగిన ఫొటోను కృతి తన స్టోరీలో పంచుకున్నారు. ‘హ్యాపీ బర్త్‌డే క్యూటీ’ అంటూ హార్ట్ ఎమోజీతో పాటు దిష్టి తగలకూడదనే భావాన్ని సూచించే ఎమోజీని జోడించారు. దీంతో వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధంపై నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. కృతి సోదరి నుపూర్ సనన్ కూడా కబీర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపినట్లు సమాచారం. గతంలో లండన్, గ్రీస్, దుబాయ్‌లలో కృతి, కబీర్ కలిసి కనిపించినట్లు వార్తలు వచ్చాయి. ఇటీవల దీపావళి వేడుకల్లోనూ కృతి కుటుంబ సభ్యులతో కలిసి కబీర్ పాల్గొన్నట్లు కథనాలు పేర్కొన్నాయి. కబీర్ బహియా యూకేకు చెందిన వ్యాపారవేత్త కుల్జిందర్ బహియా కుమారుడు. కృతి కంటే ఆయన తొమ్మిదేళ్లు చిన్నవారని సమాచారం. అయితే కబీర్‌తో తన సంబంధంపై కృతి ఇప్పటివరకు అధికారిక ప్రకటన చేయలేదు. వ్యక్తిగత జీవితం గురించి వివాహం జరిగినప్పుడు మాత్రమే మాట్లాడతానని గతంలో ఆమె స్పష్టం చేశారు. దీంతో ప్రస్తుతం జరుగుతున్న ప్రచారంపై స్పష్టత రావాల్సి ఉంది.



పుకార్లపై వివరణ ఇవ్వను

ఈవార్తలు, వినోదవాణి: తన వ్యక్తిగత జీవితంపై వచ్చే పుకార్లు బాధ కలిగించినా వాటిపై ప్రతి ఒక్కరికీ వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదని నటి కీర్తి సురేష్ అన్నారు. తన భర్త ఆంటోనీతో ఉన్న అనుబంధం గురించి ఇటీవల ఓ కార్యక్రమంలో మాట్లాడారు. తమ మధ్య నమ్మకం ఉన్నప్పుడు ఇతరులకు ఏదో నిరూపించుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎన్ఎస్ మ్యూజిక్ కార్యక్రమంలో పాల్గొన్న కీర్తిని జీవితంలో ఎక్కువగా బాధపెట్టిన సంఘటన గురించి ప్రశ్నించారు. దీనికి ఆమె స్పందిస్తూ.. ఇతర నటులతో తనకు సంబంధాలు ఉన్నాయంటూ వచ్చే పుకార్లు బాధ కలిగిస్తాయని చెప్పారు. “నేను ఒకే ఒక్క వ్యక్తితో అనుబంధంలో ఉన్నాను. అయినా ఇతర నటులతో నన్ను ముడిపెడుతూ వార్తలు వస్తుంటాయి. వాటిపై స్పందించాలా అని ఆంటోనీ అప్పుడప్పుడు అడుగుతారు. కానీ ఆయన నన్ను ఎప్పుడూ అనుమానించలేదు. మేమిద్దరం బాగున్నప్పుడు ఇతరులకు ఏం నిరూపించాలి?” అని కీర్తి ప్రశ్నించారు. తన భర్త ఆంటోనీ ఎంతో మంచి వ్యక్తి అని, వృత్తిపరంగా తనకు పూర్తి స్వేచ్ఛ ఇస్తారని తెలిపారు. తాను నిరాశకు గురైనప్పుడు ఆయనతో మాట్లాడతానని, ఆయన మాటలు తనకు ధైర్యాన్నిస్తాయని చెప్పారు. ‘డోరతీ’ సినిమాలో నటించేందుకు కూడా ఆంటోనీ తనను ప్రోత్సహించారని కీర్తి వెల్లడించారు. తన నిర్ణయాలను గౌరవిస్తూ ఎప్పుడూ అండగా ఉంటారని పేర్కొన్నారు.

నాకు ఏడు భాషలు వచ్చు: సాయిపల్లవి



ఈవార్తలు, వినోదవాణి: నటి సాయిపల్లవి తనకు ఏడు భాషలు మాట్లాడటం వచ్చని వెల్లడించారు. ఇటీవల ఓ టాక్ షోలో పాల్గొన్న ఆమె తనకు తెలిసిన భాషల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. నటన, డ్యాన్స్‌తో పాటు భాషలపై కూడా తనకు మంచి పట్టు ఉందని చెప్పారు. కార్యక్రమంలో హోస్ట్ ఎన్ని భాషలు మాట్లాడగలరని ప్రశ్నించగా.. తెలుగు, ఇంగ్లిష్, తమిళం, మలయాళం, హిందీ, జార్జియన్ భాషలు మాట్లాడగలనని సాయిపల్లవి తెలిపారు. తన మాతృభాష బడగ అని, అందులోనూ అనర్గళంగా మాట్లాడగలనని చెప్పారు. మొత్తం ఏడు భాషలు వచ్చని వివరించారు. కన్నడ భాష గురించి ప్రశ్నించగా తనకు ఆ భాష తెలియదని, అర్థం కూడా కాదని సాయిపల్లవి పేర్కొన్నారు. ఆమె సమాధానాలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఎంబీబీఎస్ చదివిన సాయిపల్లవి నటిగా, డ్యాన్సర్‌గా ప్రత్యేక గుర్తింపు పొందారు. పాత్రకు ప్రాధాన్యం ఉన్న సినిమాలను ఎంచుకుంటూ వివిధ భాషల్లో నటిస్తున్నారు.

సహజత్వాన్ని వదులుకోను



ఈవార్తలు, వినోదవాణి: ఇతరుల అభిప్రాయాలకు అనుగుణంగా తన రూపాన్ని మార్చుకోవాల్సిన అవసరం లేదని నటి నిత్యా మీనన్ అన్నారు. సహజంగా ఉండటమే తనకు ఇష్టమని, సమాజం నిర్దేశించే అందం ప్రమాణాలను అనుసరించాలనే ఆలోచన తనకు లేదని స్పష్టం చేశారు. ‘మిస్టర్ అండ్ మిసెస్ గ్రే’ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిత్యా మీనన్ తన చిన్ననాటి అనుభవాలను పంచుకున్నారు. సమాజంలో ఉన్న ట్రెండ్స్, అందం గురించి ఇతరులు చేసే వ్యాఖ్యలు వ్యక్తులపై ఎలాంటి ప్రభావం చూపుతాయనే అంశంపై మాట్లాడారు. “నేను ఎలా ఉన్నానో అలాగే ఉండాలనుకుంటాను. అప్పుడే నాకు సంతోషంగా ఉంటుంది. ఇతరుల కోసం నన్ను నేను మార్చుకోవడం ఇష్టం లేదు” అని చెప్పారు. తనకు 15, 16 ఏళ్ల వయసున్నప్పుడు కర్లీ హెయిర్ ఇప్పటిలా ట్రెండ్‌లో లేదని గుర్తుచేసుకున్నారు. జుట్టును స్ట్రెయిట్ చేయించుకోవాలని, మందంగా ఉన్న కనుబొమ్మలను సన్నగా మార్చుకోవాలని చాలామంది సూచించేవారని తెలిపారు. అయితే ఆ మాటలను పట్టించుకోలేదన్నారు. “నాకు సహజంగా వచ్చిన జుట్టును ఎందుకు మార్చుకోవాలి? దాన్ని ఎలా అందంగా ఉంచుకోవాలనే ఆలోచించాను.



పాక్ క్రికెటర్లకు పీసీబీ షాక్

ఈవార్తలు, క్రీడావాణి: పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ప్రకటించిన కొత్త సెంట్రల్ కాంట్రాక్టులు ఆ దేశ క్రికెట్‌లో చర్చనీయాంశమయ్యాయి. మాజీ కెప్టెన్లు మహమ్మద్ రిజ్వాన్, షాన్ మసూద్‌తోపాటు యువ ఆల్‌రౌండర్ సయామ్ అయూబ్‌కు జాబితాలో చోటు దక్కలేదు. మొత్తం 38 మంది ఆటగాళ్లకు పీసీబీ కాంట్రాక్టులు ప్రకటించింది. లాహోర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పాకిస్థాన్ హెడ్ కోచ్ మైక్ హెస్సన్, పీసీబీ హై పర్ఫార్మెన్స్ డైరెక్టర్ అకిబ్ జావేద్ వివరాలను వెల్లడించారు. కొత్త కాంట్రాక్టులు 2026 జులై నుంచి 2027 జూన్ వరకు అమల్లో ఉంటాయని తెలిపారు. గత జూన్‌లో పాత కాంట్రాక్టుల గడువు ముగియడంతో అప్పటి నుంచి ఆటగాళ్లు సెంట్రల్ కాంట్రాక్టులు లేకుండానే ఆడుతున్నారు. ఈసారి పీసీబీ కాంట్రాక్టుల విధానంలో మార్పులు చేసింది. ఆటగాళ్లు ప్రాతినిధ్యం వహించే ఫార్మాట్ల ఆధారంగా ఐదు కేటగిరీలుగా విభజించింది. టెస్టులు-వన్డేలు, టెస్టులు మాత్రమే, వన్డేలు-టీ20లు, టీ20లు మాత్రమే, డెవలప్‌మెంట్ కాంట్రాక్టులుగా వర్గీకరించింది. టెస్టులు, వన్డేల కేటగిరీలో ప్రస్తుత టెస్టు కెప్టెన్ బాబర్ ఆజం, మాజీ టీ20 కెప్టెన్ సల్మాన్ అలీ అఘాకు మాత్రమే అవకాశం కల్పించింది. టెస్టుల కేటగిరీలో అజాన్ అవైస్, మహమ్మద్ అబ్బాస్, సాజిద్ ఖాన్, సాద్ షకీల్ చోటు దక్కించుకున్నారు. వన్డేలు, టీ20ల కేటగిరీలో షాహీన్ షా ఆఫ్రిది, అబ్రార్ అహ్మద్, అరాఫత్ మిన్హాస్, ఫఖర్ జమాన్, ఫహీమ్ అష్రఫ్, హారీస్ రవూఫ్ ఉన్నారు. టీ20ల కేటగిరీలో సాహిబ్జాదా ఫర్హాన్, హసన్ నవాజ్, మాజ్ సదాఖత్, మహమ్మద్ సల్మాన్ మీర్జా, నసీమ్ షా, షాదాబ్ ఖాన్, ఉస్మాన్ తారిఖ్‌లకు అవకాశం దక్కింది. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని 19 మంది యువ ఆటగాళ్లకు డెవలప్‌మెంట్ కాంట్రాక్టులు ఇచ్చారు. వీరిలో ఉబైద్ షా, హునైన్ షా, సాకిబ్ ఖాన్ తదితరులు ఉన్నారు.



హ్యాట్రిక్ కప్పుపై ఆర్సీబీ గురి

ఈవార్తలు, క్రీడావాణి: ఐపీఎల్‌లో వరుసగా మూడోసారి టైటిల్ గెలిచి చరిత్ర సృష్టించాలని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు లక్ష్యంగా పెట్టుకుంది. 2027 సీజన్ కోసం రిటైన్ చేసుకున్న ఆటగాళ్లపై హెడ్ కోచ్ ఆండీ ఫ్లవర్ పూర్తి సంతృప్తి వ్యక్తం చేశాడు. తమ ప్రధాన ఆటగాళ్లతోనే మరోసారి టైటిల్ సాధించగలమని ధీమా వ్యక్తం చేశాడు. డిసెంబర్ 16న జరగనున్న మినీ వేలానికి ముందు ఆర్సీబీ 20 మంది ఆటగాళ్లను రిటైన్ చేసుకుంది. జట్టులో మరో ఐదు స్థానాలు ఖాళీగా ఉండగా, వేలానికి రూ.14.15 కోట్ల పర్స్‌తో వెళ్లనుంది. జియోస్టార్‌తో మాట్లాడిన ఫ్లవర్.. గత రెండు సీజన్లు తమకు అద్భుతంగా గడిచాయని పేర్కొన్నాడు. ప్రస్తుత జట్టుపై పూర్తి నమ్మకం ఉందని, వేలంలో అవసరమైన ఆటగాళ్లను ఎంపిక చేసుకొని మరింత బలోపేతం చేస్తామని తెలిపాడు. ఇతర జట్లతో పోలిస్తే తమ వద్ద ఖర్చు చేసేందుకు తక్కువ డబ్బు ఉన్నప్పటికీ ఆందోళన చెందడం లేదన్నాడు. గత రెండేళ్లుగా అద్భుతంగా రాణించిన ప్రధాన ఆటగాళ్లను కొనసాగించడమే తమకు అతిపెద్ద బలమని చెప్పాడు. వరుసగా మూడు టైటిళ్లు గెలిచి చరిత్ర సృష్టించేందుకు 2027 సీజన్ ఎంతో కీలకమని పేర్కొన్నాడు. ఆర్సీబీ రిటైన్ చేసుకున్న ఆటగాళ్లలో విరాట్ కోహ్లీ, భువనేశ్వర్ కుమార్, దేవదత్ పడిక్కల్, జోష్ హేజిల్‌వుడ్, కృనాల్ పాండ్య, ఫిల్ సాల్ట్, టిమ్ డేవిడ్, వెంకటేశ్ అయ్యర్ ఉన్నారు. జాకబ్ బెథెల్, రిచర్డ్ గ్లీసన్‌తోపాటు మరో నలుగురిని జట్టు విడుదల చేసింది.

'సిరాజ్' అంశంలో సెలక్టర్లకు కపిల్ దేవ్ మద్దతు

ఈవార్తలు, క్రీడావాణి: న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో మహమ్మద్ సిరాజ్‌కు తుది జట్టులో చోటు దక్కకపోవడం రాజకీయ వివాదానికి దారితీసింది. సిరాజ్‌ను మతం ఆధారంగా పక్కనపెట్టారంటూ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ చేసిన ఆరోపణలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఖండించాడు. క్రికెట్‌లో అవకాశాలు ప్రతిభ ఆధారంగానే దక్కుతాయని స్పష్టం చేశాడు. ఈ వివాదంపై భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ స్పందించాడు. జట్టు ఎంపికపై నిర్ణయాలు తీసుకునే బాధ్యత సెలక్టర్లదేనని, వారి పనితీరును తాను గౌరవిస్తానని తెలిపాడు. ప్రస్తుత సెలక్టర్లు అద్భుతంగా పనిచేస్తున్నారని ప్రశంసించాడు. సిరాజ్ ఎంపిక విషయంలో వ్యాఖ్యానించే అధికారం తనకు లేదని కపిల్ పేర్కొన్నాడు. జట్టును ఎంపిక చేసే బాధ్యతలో ఉన్నవారే తమ నిర్ణయాలకు జవాబుదారీగా ఉండాలని అభిప్రాయపడ్డాడు. సెలక్షన్ ప్రక్రియలో అందరినీ సంతృప్తి పరచడం సాధ్యం కాదని చెప్పాడు. సిరాజ్ ఆటతీరు తనకు కూడా ఇష్టమేనని కపిల్ వెల్లడించాడు. అయితే వ్యక్తిగత ఇష్టాయిష్టాల ఆధారంగా జట్టును ఎంపిక చేయకూడదని స్పష్టం చేశాడు. సెలక్టర్లు, జట్టు మేనేజ్‌మెంట్, కెప్టెన్ కలిసి భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నాడు. ప్రస్తుతం భారత క్రికెట్ మంచి ప్రదర్శన చేస్తోందని, అదే అత్యంత ముఖ్యమైన విషయమని కపిల్ దేవ్ అభిప్రాయపడ్డాడు.



ఆ చీకటి రోజులు మళ్లీ వద్దు: డారెన్ లీమన్

ఈవార్తలు, క్రీడావాణి: ఆస్ట్రేలియా క్రికెట్‌ను కుదిపేసిన 2018 నాటి శాండ్‌పేపర్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. బాల్ ట్యాంపరింగ్ ప్రణాళిక గురించి తనకు ముందే తెలుసంటూ వస్తున్న ఆరోపణలను ఆస్ట్రేలియా మాజీ కోచ్ డారెన్ లీమన్ ఖండించాడు. ఆ ఘటన తర్వాత తాను మానసికంగా తీవ్రంగా కుంగిపోయానని, మళ్లీ ఆ చీకటి రోజులను గుర్తుచేసుకోవాలని లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. దక్షిణాఫ్రికాతో 2018లో జరిగిన టెస్టులో ఆస్ట్రేలియా ఆటగాళ్లు బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడిన విషయం తెలిసిందే. తాజాగా ఉస్మాన్ ఖవాజా, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ చేసిన వ్యాఖ్యలతో ఈ వివాదం మళ్లీ చర్చనీయాంశమైంది. బంతిని రఫ్ చేసే విషయంపై డ్రెస్సింగ్ రూమ్‌లో చర్చ జరిగిందని, ఆ సమయంలో లీమన్‌తోపాటు బౌలింగ్ కోచ్ డేవిడ్ సేకర్ కూడా అక్కడే ఉన్నారని బాన్‌క్రాఫ్ట్ తన కథనంలో పేర్కొన్నాడు. శాండ్‌పేపర్ ఉపయోగించాలనే ఆలోచనను డేవిడ్ వార్నర్ ముందుకు తెచ్చాడని తెలిపాడు. ఈ ఆరోపణలపై ఏబీసీ రేడియోతో మాట్లాడిన లీమన్.. ఆ కుట్ర గురించి తనకు ముందుగా తెలియదని స్పష్టం చేశాడు. బాన్‌క్రాఫ్ట్ ప్రస్తావించిన చర్చ జరిగినప్పుడు తాను అక్కడ ఉన్నట్లు గుర్తులేదన్నాడు. ఘటన జరిగి ఎనిమిదిన్నరేళ్లు అవుతున్నాయని, అప్పట్లో చెప్పిన మాటలకే ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని పేర్కొన్నాడు. ఆ వివాదానికి కోచ్‌గా బాధ్యత వహిస్తున్నానని లీమన్ అంగీకరించాడు. రివర్స్ స్వింగ్ కోసం బంతిని రఫ్ చేయడం గతంలోనూ జరిగేదని, అయితే 2018లో పరిస్థితి హద్దులు దాటిందని వ్యాఖ్యానించాడు. ఆ ఘటనతో ప్రపంచ క్రికెట్‌లో అత్యుత్తమ ఉద్యోగాన్ని కోల్పోయానని, అందుకు ఇప్పటికీ బాధపడుతున్నానని చెప్పాడు. వివాదం తర్వాత సాధారణ స్థితికి రావడానికి మూడు, నాలుగేళ్లు పట్టిందని లీమన్ వెల్లడించాడు. మళ్లీ ఆ బాధాకరమైన పరిస్థితుల్లోకి వెళ్లాలని లేదని, ఈ వ్యవహారంలో భాగమైన ఆటగాళ్లు, సిబ్బంది అందరి పట్ల తనకు సానుభూతి ఉందని తెలిపాడు.



కివీస్‌పై భారత్ పట్టు

మూడో రోజు ముగిసేసరికి 118 పరుగుల ఆధిక్యం

రాహుల్ సెంచరీ.. గిల్‌కు త్రుటిలో తప్పిన శతకం

న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరుగుతున్న తొలి టెస్టులో భారత బ్యాటర్లు ఆధిపత్యం ప్రదర్శించారు. ఓపెనర్ కేఎల్ రాహుల్ అద్భుత సెంచరీతో రాణించగా, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రెండు పరుగుల తేడాతో శతకం చేజార్చుకున్నాడు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ నాలుగు వికెట్ల నష్టానికి 486 పరుగులు చేసి 118 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది.



ఈవార్తలు, క్రీడావాణి: భారత ఇన్నింగ్స్‌లో రాహుల్ సెంచరీ కీలకంగా నిలిచింది. తొమ్మిది ఫోర్లు, రెండు సిక్సర్లతో 136 పరుగులు చేసిన రాహుల్ తన టెస్టు కెరీర్‌లో 13వ శతకాన్ని నమోదు చేశాడు. దేవదత్ పడిక్కల్‌తో కలిసి రెండో వికెట్‌కు 165 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. పడిక్కల్ 80 పరుగుల వద్ద కైల్ జేమీసన్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన గిల్ కూడా కివీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నాడు. సెంచరీకి చేరువైన గిల్ మూడో రోజు చివరి ఓవర్‌లో జాకబ్ డఫీ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. 98 పరుగుల వద్ద ఔటవడంతో శతకం చేజారింది. ఆట ముగిసే సమయానికి రిషభ్ పంత్ 55 పరుగులతో, నైట్ వాచ్‌మన్ అన్షుల్ కాంబోజ్ పరుగులేమీ చేయకుండా క్రీజులో ఉన్నారు. అంతకుముందు న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 368 పరుగులకు ఆలౌటైంది.

టాప్-5 అంతా ఫిఫ్టీ

న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరుగుతున్న తొలి టెస్టులో భారత బ్యాటర్లు అరుదైన రికార్డు సృష్టించారు. ఒకే ఇన్నింగ్స్‌లో టాప్-5 బ్యాటర్లందరూ 50 లేదా అంతకంటే ఎక్కువ పరుగులు సాధించారు. భారత టెస్టు క్రికెట్ చరిత్రలో ఈ ఘనత నమోదు కావడం ఐదోసారి కాగా, విదేశీ గడ్డపై మాత్రం ఇదే తొలిసారి. 94 ఏళ్ల భారత టెస్టు చరిత్రలో ఇలాంటి ప్రదర్శన ఇప్పటివరకు నమోదు కాలేదు. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్‌ను 368 పరుగులకు ఆలౌట్ చేసిన భారత్, మూడో రోజు ఆట ముగిసే సమయానికి నాలుగు వికెట్ల నష్టానికి 486 పరుగులు చేసింది. దీంతో 118 పరుగుల ఆధిక్యం సంపాదించింది. భారత ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (85), కేఎల్ రాహుల్ (136) తొలి వికెట్‌కు 130 పరుగులు జోడించి శుభారంభం అందించారు. ఆ తర్వాత దేవదత్ పడిక్కల్ 80 పరుగులతో రాణించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 98 పరుగులు చేసి రెండు పరుగుల తేడాతో సెంచరీ చేజార్చుకున్నాడు. రిషభ్ పంత్ 62 బంతుల్లో 55 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో సెంచరీ సాధించిన కేఎల్ రాహుల్ పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. న్యూజిలాండ్ గడ్డపై తన తొలి టెస్టు ఇన్నింగ్స్‌లోనే శతకం సాధించిన మూడో భారత బ్యాటర్‌గా నిలిచాడు. గతంలో 1976లో సునీల్ గవాస్కర్ (116), సురీందర్ అమర్‌నాథ్ (124) ఈ ఘనత సాధించారు. అలాగే సేనా దేశాలైన దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియాల్లో టెస్టు సెంచరీలు సాధించిన ఐదో భారత క్రికెటర్‌గా రాహుల్ నిలిచాడు. జైస్వాల్‌తో 130, పడిక్కల్‌తో 165 పరుగుల భాగస్వామ్యాలు నెలకొల్పి భారత్‌ను పటిష్ఠ స్థితిలో నిలిపాడు.

కెప్టెన్సీ వదిలే ప్రసక్తే లేదు: కమిన్స్

ఈవార్తలు, క్రీడావాణి: ఆస్ట్రేలియా టెస్టు జట్టు కెప్టెన్సీ నుంచి తప్పుకుంటున్నట్లు వస్తున్న వార్తలను ప్యాట్ కమిన్స్ ఖండించాడు. సారథ్య బాధ్యతలను వదులుకునే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశాడు. 2018 నాటి శాండ్‌పేపర్ వివాదం మరోసారి తెరపైకి వచ్చిన నేపథ్యంలో క్రికెట్ ఆస్ట్రేలియా చేపట్టనున్న స్వతంత్ర సమీక్షకు పూర్తి మద్దతు ప్రకటించాడు. సిడ్నీలో క్రికెట్ ఆస్ట్రేలియా చైర్మన్ డేవిడ్ బూన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ టాడ్ గ్రీన్‌బర్గ్‌లతో శుక్రవారం సమావేశమైన అనంతరం కమిన్స్ ప్రకటన విడుదల చేశాడు. ఆస్ట్రేలియా జట్టుకు నాయకత్వం వహించడం గొప్ప బాధ్యతని, దానిని తాను ఎప్పుడూ తేలిగ్గా తీసుకోలేదని పేర్కొన్నాడు. 2018 వివాదంలో భాగమైన ఆటగాళ్లు, సహాయక సిబ్బందితో బోర్డు సంప్రదింపులు జరపడం మంచి పరిణామమని అభిప్రాయపడ్డాడు. ప్రతిపాదిత స్వతంత్ర ఫోరమ్‌కు వందశాతం మద్దతు ఇస్తున్నానని, ఆ సమావేశంలో తన అభిప్రాయాలను వెల్లడిస్తానని తెలిపాడు. ఈ ప్రక్రియలో కొన్ని కఠినమైన ప్రశ్నలు ఎదురుకావచ్చని, అయినప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో అలాంటి చర్చ అవసరమని కమిన్స్ పేర్కొన్నాడు. తన దృష్టి మాత్రం డిసెంబర్ 9 నుంచి పెర్త్‌లో న్యూజిలాండ్‌తో ప్రారంభం కానున్న నాలుగు టెస్టుల సిరీస్‌పైనే ఉందని స్పష్టం చేశాడు. మరోవైపు క్రికెట్ ఆస్ట్రేలియా కూడా కమిన్స్ నాయకత్వానికి మద్దతు ప్రకటించింది. అతడి నిజాయతీని శంకించాల్సిన అవసరం లేదని డేవిడ్ బూన్ పేర్కొన్నాడు. ఉస్మాన్ ఖవాజా ఆత్మకథలోని అంశాలు, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ చేసిన తాజా ఆరోపణలతో శాండ్‌పేపర్ వివాదం మళ్లీ చర్చకు వచ్చింది. బాల్ ట్యాంపరింగ్ విషయం బౌలర్లకు కూడా తెలుసన్న ఆరోపణలను కమిన్స్ ఇప్పటికే ఖండించాడు.



ధోనీ నిర్ణయం ఆశ్చర్యపరిచింది

ఈవార్తలు, క్రీడావాణి: మహేంద్ర సింగ్ ధోనీ ఐపీఎల్‌కు ఆటగాడిగా వీడ్కోలు పలకడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని చెన్నై సూపర్ కింగ్స్ హెడ్ కోచ్ జహీర్ ఖాన్ పేర్కొన్నాడు. అయితే ఏ సమయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో ధోనీకి బాగా తెలుసని అభిప్రాయపడ్డాడు. సుదీర్ఘకాలంగా చెన్నై జట్టుతో అనుబంధం కొనసాగిస్తున్న ధోనీ, ఆటగాడిగా రిటైర్మెంట్ ప్రకటించి 2027 సీజన్ నుంచి మెంటార్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. నవంబర్ 17న ప్లేయర్ రిటెన్షన్ జాబితా విడుదలైన సమయంలో సీఎస్‌కే యాజమాన్యం ఈ విషయాన్ని వెల్లడించింది. పిక్క కండరాల గాయం కారణంగా ధోనీ 2026 ఐపీఎల్ సీజన్‌కు పూర్తిగా దూరమయ్యాడు. చివరిసారిగా 2025 సీజన్‌లో మైదానంలో కనిపించాడు. 2008 నుంచి 19 సీజన్ల పాటు ఐపీఎల్‌లో కొనసాగిన ధోనీ మొత్తం 278 మ్యాచ్‌లలో 5,439 పరుగులు సాధించాడు. కెప్టెన్‌గా చెన్నై సూపర్ కింగ్స్‌కు ఐదు ఐపీఎల్ టైటిళ్లతోపాటు రెండు ఛాంపియన్స్ లీగ్ ట్రోఫీలను అందించాడు. ఇకపై మైదానంలో ఆటగాడిగా కనిపించకపోయినా మెంటార్‌గా అతడి అనుభవం, సూచనలు జట్టుకు ఉపయోగపడతాయని చెన్నై యాజమాన్యం భావిస్తోంది.



డబ్ల్యూటీసీలో గిల్ రికార్డు

ఈవార్తలు, క్రీడావాణి: భారత టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో అరుదైన రికార్డు సాధించాడు. డబ్ల్యూటీసీ చరిత్రలో 3 వేల పరుగులు పూర్తి చేసిన తొలి భారత బ్యాటర్‌గా నిలిచాడు. న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరుగుతున్న తొలి టెస్టు మూడో రోజు ఈ ఘనత అందుకున్నాడు. దూకుడుగా బ్యాటింగ్ చేసిన గిల్ 98 పరుగులు సాధించాడు. గ్లెన్ ఫిలిప్స్ బౌలింగ్‌లో భారీ సిక్సర్ బాది 3 వేల పరుగుల మైలురాయిని చేరుకున్నాడు. అయితే మరో రెండు పరుగులు చేస్తే సెంచరీ పూర్తయ్యే సమయంలో ఔటై నిరాశగా వెనుదిరిగాడు. గిల్ రికార్డు సాధించిన కొద్దిసేపటికే వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ కూడా డబ్ల్యూటీసీలో 3 వేల పరుగులు పూర్తి చేశాడు. ఈ ఘనత సాధించిన రెండో భారత బ్యాటర్‌గా నిలిచాడు. అంతేకాకుండా డబ్ల్యూటీసీ చరిత్రలో ఈ మైలురాయిని అందుకున్న తొలి వికెట్ కీపర్‌గా రికార్డు సృష్టించాడు. 123వ ఓవర్‌లో బౌండరీ బాది తన 22వ టెస్టు హాఫ్ సెంచరీతోపాటు ఈ ఘనత సాధించాడు. వీరిద్దరి రికార్డులపై బీసీసీఐ ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపింది. ఈ మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ 136 పరుగులతో సెంచరీ సాధించగా, యశస్వి జైస్వాల్ 85, దేవదత్ పడిక్కల్ 80 పరుగులతో రాణించారు.

ఈవార్తలు
ప్రజావాణి
ఆదివారం 22-11-2026, జగిత్యాల
www.evarthalu.com
ఈవార్తలు
12



కుక్కల్లా మొరుగుతున్నారు..!

(వీళ్లా మన నాయకులు?)

దేశానికి ఏం కావాలో తెల్వదు..
దేశానికి ఏం చేస్తారో చెప్పరు..
దేశాన్ని బాగుచేసే ప్లాన్ లేదు..
సమస్యలపై పోరాటం లేదు..
యువతకు దారిచూపే విజన్ లేదు..
రైతుకు గిట్టుబాటు భద్రత లేదు..
భవిష్యత్తు ఆశలపై విజ్ఞత లేదు..
ఏమాత్రం వికాసపు ఆలోచనల్లేవు..
విజ్ఞానపు వెలుగులు అసలే లేవు..
కావాల్సిందొక్కటే.. పార్టీ జెండా!
అధికారమే అసలు అజెండా!!

ప్రభుత్వానికి, దేశానికి మధ్య తేడా తెలియని వ్యవహారం..
ప్రభుత్వాన్ని విమర్శించాలని.. దేశాన్ని విమర్శించే అవివేకం..
విదేశాలకు వెళ్లి మా దేశం డొల్ల అని మాట్లాడే విలువల్లేని వ్యక్తిత్వం..
కరువు వస్తుందంటే.. కమీషన్ల లెక్కలేసే స్వార్థ రాజకీయం..
కష్టాల్లో ఉన్న రైతుల్లో భరోసా నింపలేని అసమర్థ నాయకత్వం..

రైతు పంటకు గిట్టుబాటు కాదు..
సభకు జనం రావాలంటాడు ఒకడు..!
యువత చేతికి కొలువు కాదు..
పార్టీ జెండా పట్టాలంటాడు మరొకడు..!
దేశానికి మేలు జరగటం కాదు..
దేశమే తన వెంట నడవాలంటాడు ఇంకొకడు..!
ఇదా.. కావాల్సింది దేశానికి?
ఇదా.. కోరుతున్నది భారతావని?

"ప్రభుత్వంలో ఏదైనా లోపం కనిపిస్తే తన చెవిలో చెప్పాలన్న రేవంత్ రెడ్డి.. మరి సొంత పార్టీ నేతల్లో ఆయనకు కనిపించిన లోపాన్ని వాళ్లను పిలిచి ఎందుకు చెప్పలేదు? అందుకు సిద్దిపేట సభలో మైకు ఎందుకు కావాల్సి వచ్చింది? సొంత పార్టీ నేతలను ఉద్దేశించి 'ఎర్రికుక్క కరిచిందో తెలియదు' అంటూ తీవ్ర పదజాలాన్ని వాడారు. అలాంటి వాళ్లను కాంగ్రెస్ కార్యకర్తలు ఎర్రగడ్డ ఆస్పత్రికి తీసుకెళ్తారనీ అన్నారు. ఇక్కడ రేవంత్ పాటించిన సంయమనం ఏది?"

"భారత్‌లో తీవ్రమైన నిరుద్యోగం ఉందని, విద్యావ్యవస్థలో లోపాలు ఉన్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ న్యూయార్క్‌లోని కొలంబియా వర్సిటీలో వ్యాఖ్యానించారు. దేశంలో ఆర్థిక విపత్తు ఉందని అన్నారు. మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా ఆశించిన ఫలితాలు ఇవ్వలేదనీ చెప్పారు. మరి దేశంలో ఇన్ని సమస్యలు ఉంటే పోరాటం చేయాల్సింది పోయి.. పరాయి దేశంలో దేశ పరువు తీసే చిల్లర పలుకులు ఎందుకు?"



"ప్రజలకు కావాల్సింది తిట్లతో కూడిన రాజకీయ వినోదం కాదు.. సమస్యలకు పరిష్కారం చూపే పాలన. రాజకీయ వేదికలపై మాటల తూటాలు పేల్చడం కంటే, సంక్షోభాలను ఎదుర్కొనే కార్యాచరణతో పాలకులు ముందుకు రావాలి. నాయకుడి నోటి నుంచి వచ్చే మాటలు రాజకీయ సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. దేశ సమగ్రతను కాపాడే క్రమంలో, సమస్యలను పరిష్కరించే వేళ.. పాలకుడైనా, ప్రతిపక్ష నాయకుడైనా జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్రజాస్వామ్యంలో నాయకుడి గొప్పతనం ప్రత్యర్థులను ఎంతగా తిట్టగలడన్న దానిలో కాదు.. ప్రజల సమస్యలను ఎంత సమర్థంగా పరిష్కరించగలడన్న దానిలోనే ఉంటుంది."



- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి
ఎడిటర్, ఎంటెక్, ఎల్ఎల్బీ
9581291919,
9441291919

శ్రావణ వాణి

రాజకీయాల్లో విమర్శలు సహజం. అధికార పక్షాన్ని ప్రతిపక్షం నిలదీయడం, ప్రతిపక్ష విమర్శలకు అధికార పార్టీ సమాధానం చెప్పడం ప్రజాస్వామ్యానికి ఆరోగ్యకరం. కానీ విమర్శల స్థాయి దిగజారి వ్యక్తిగత దూషణలు, నోటి దురుసు, అవమానకర వ్యాఖ్యలే రాజకీయ అస్త్రాలుగా మారితే.. ప్రజాస్వామ్య విలువలకే విఘాతం కలుగుతుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారశైలి ఇటీవలి కాలంలో ఈ ఆందోళనను మరింత పెంచుతోంది. ప్రతిపక్ష నేతలపై ఘాటైన విమర్శలు చేయడమే కాకుండా, తాజాగా సొంత పార్టీ నేతలను సైతం కుక్కలతో పోలుస్తూ వ్యాఖ్యలు చేయడం రాజకీయ సంస్కృతిపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. సీఎం అంటే.. రాష్ట్రంలోని కోట్లాది ప్రజలకు ప్రాతినిధ్యం వహించే బాధ్యత. ఆ పదవిలో ఉన్న వ్యక్తి మాటల్లో సంయమనం, వ్యవహారంలో హుందాతనం, నిర్ణయాల్లో దూరదృష్టి కనిపించాలి. రాజకీయ ప్రత్యర్థులపై ఎంతటి విమర్శ చేసినా అది విధానాలకే పరిమితం కావాలి. వ్యక్తుల గౌరవాన్ని కించపరిచేలా, సభ్యసమాజం తలదించుకునేలా మాట్లాడటం నాయకత్వ లక్షణం కాదు. ప్రజలు ఎన్నుకున్నది తిట్ల రాజకీయాలు చేయడానికి కాదు. తమ సమస్యలను పరిష్కరించడానికి. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి, రైతులకు భరోసా ఇవ్వడానికి, విద్యా, వైద్య రంగాలను బలోపేతం చేయడానికి, పెరుగుతున్న ధరల నుంచి సామాన్యులకు ఉపశమనం కలిగించడానికి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రజలు ఎదురుచూస్తున్నారు. పాలనలో ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారాలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ నేతల తిట్లే ప్రధాన చర్చగా మారడం దురదృష్టకరం.

పార్టీని కాపాడలేని నాయకత్వ లేమి.. నాయకుల మధ్య సమన్వయాన్ని జోడించలేని స్థితి.. ప్రజలకు చేరువయ్యే వ్యూహాలలేమి.. ఎన్నికల సమయంలో ప్రచార హడావుడి.. ఎన్నికల్లో ఓడిపోతే తప్పు ఒప్పుకోలేని పరిస్థితి.. ఇదీ రాహుల్ గాంధీ దుస్థితి. భారత రాజకీయాల్లో రాహుల్ గాంధీకి లభించిన అవకాశాలు మరే నాయకుడికీ అంత సులభంగా లభించవు. రాజకీయ వారసత్వం, దేశవ్యాప్తంగా గుర్తింపు, కాంగ్రెస్ పార్టీ అండ, ప్రజా వేదికలపై విస్తృత ప్రచార అవకాశం.. ఇవన్నీ ఆయనకు అందుబాటులో ఉన్నాయి. అయినప్పటికీ, రాజకీయంగా తనదైన ముద్ర వేయడంలో పదేపదే తడబడుతున్నారు. దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాలనే ఆకాంక్ష ఉన్న నాయకుడికి విమర్శించే ధోరణి మాత్రమే సరిపోదు. రాజకీయ అవగాహన, విషయ పరిజ్ఞానం, వ్యూహాత్మక ఆలోచన, పరిణతి కూడా అత్యవసరం. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం ప్రతిపక్ష నాయకుడి బాధ్యత. కానీ ప్రశ్నించడానికి ముందు అంశంపై సమగ్ర అవగాహన ఉండాలి. ఆరోపణ చేయడానికి ముందు వాస్తవాలను పరిశీలించాలి. ప్రజల్లోకి వెళ్లే ప్రతి మాట రాజకీయంగా ఒక సందేశాన్ని అందిస్తుంది. ఆ సందేశం నిర్మాణాత్మకంగా ఉండాలి. లేదంటే విమర్శలే విమర్శకుడి విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తాయి. రాహుల్ గాంధీ ప్రసంగాలు, రాజకీయ వ్యాఖ్యల్లో కొన్ని సందర్భాల్లో కనిపించే తొందరపాటు ఈ కోవలోకే వస్తుంది. దేశ ఆర్థిక వ్యవస్థ, విదేశాంగ విధానం, జాతీయ భద్రత, సామాజిక అంశాలపై మాట్లాడేటప్పుడు రాజకీయ ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలే ముఖ్యం. అంతర్జాతీయ పరిణామాలను దేశీయ రాజకీయాలకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేయడం ఒక ఎత్తు కాగా, వాటి వాస్తవ స్వరూపాన్ని అర్థం చేసుకొని ప్రజలకు వివరించడం మరో ఎత్తు. కానీ, ప్రభుత్వ పాలకులను విమర్శించే క్రమంలో సొంత దేశాన్నే విమర్శిస్తూ పప్పులో కాలేస్తున్నారు. రాజకీయ పరిణతి లేక, ప్రజల విశ్వాసం పొందలేక, అవగాహన లోపంతో ఇప్పటికీ 'ఫెయిల్యూర్'గానే మిగిలిపోతున్నారు.

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9493541919

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9493541919. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.